విశాఖపట్టణం
సోమవారం 20 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 86 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



చెన్నై నగరం కోసం...

## సూపర్ సిక్స్ హామీలు

డీఎంకే సీఎం స్టాలిన్ ప్రకటన

2



## పవన్ హెల్త్‌పై ప్రధాని ఆరా

**డిప్యూటీ సీఎంకు ఫోన్ కాల్.. ఆరోగ్యంపై జాగ్రత్తలు**

**ట్వీట్ ద్వారా వెల్లడించిన పవన్ కళ్యాణ్**

(అమరావతి - జయజయహే)

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ప్రధాని మోదీ ఆరా తీశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పవన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు 'ఎక్స్'లో ప్రధాని పోస్టు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. దీంతో వైద్యులు ఆయనకి శస్త్ర చికిత్స చేసినట్లు పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ శనివారం వెల్లడించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్స జరిగింది. శుక్రవారం ఉదయం పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష నిర్వస్తున్న సందర్భంలో పవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని : తీవ్రమైన తలనెప్పి, కళ్లు తిరిగటంతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన వ్యక్తిగత వైద్యుల సలహాతో శుక్రవారంనాటి అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. అక్కడ అపోలో ఆసుపత్రిలో వైద్య పరీక్షలతోపాటు ఎం.ఆర్.ఐ. స్కానింగ్ చేశారు. వైద్య పరిక్షల నివేదికలు, స్కానింగ్ రిపోర్టును పరిశీలించిన వైద్యులు పవన్ కల్యాణ్‌కు శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు. ఆ మేరకు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స పూర్తి చేశారు.

# తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి


**వాస్తవాలను ప్రజలకు చెప్పాలి**

**సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు**

**తాజా రాజకీయాలపై నేతలతో టెలికాన్ఫరెన్స్**

(అమరావతి - జయజయహే)

**రాష్ట్రాభివృద్ధి విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, అయినా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అలాంటి వారి ప్రచారాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, ప్రభుత్వ సేవల వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న టీడీపీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై సమీక్ష చేశారు.**



ప్రభుత్వం, కూటమి పార్టీలపై అబద్ధాలాడుతూ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. అలాంటి తప్పుడు సమాచారాన్ని వివిధ మార్గాలు, వ్యక్తుల ద్వారా చేరవేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిందేనని పార్టీ నేతలను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు వాస్తవాలు తెలిస్తే వాళ్లే విశ్లేషించుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. పరిపాలన విషయంలో ఏపీ ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పగలిగితే.. ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారన్నారు.

మొన్నటి ఎన్నికల్లో నాటి ప్రభుత్వం కూటమి పార్టీలను ఎంతగా అణగదొక్కే ప్రయత్నం చేసినా.. ప్రజలకు వాస్తవాలు తెలుసు కాబట్టి అద్భుతమైన విజయాన్ని అందించారని గుర్తు చేశారు. ప్రజలకు నిజాలను తెలియచేయడమనేది ప్రధాన బాధ్యతనే విషయాన్ని గుర్తించాలని నేతలకు సీఎం చంద్రబాబు సూచించారు. ఇక, టీడీపీ నిర్వహిస్తున్న ట్రైనింగ్ క్లాసులతోపాటు, కాఫీ కబుర్లు వంటి కార్యక్రమాల ద్వారా లీడర్-కేడర్ మధ్య ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. శిక్షణకు వచ్చే కార్యకర్తలకు పార్టీ ధోరణి, సిద్ధాంతాలను వివరించడంతోపాటు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ఫీడ్ బ్యాక్ తీసుకునే వీలు కలుగుతోందని చెప్పారు.

విద్య, వైద్యం, ఉపాధి ..మిగతా 2లో

# అప్పన్నకు శఠగోపం... అప్పనంగాళ్లకు సహస్ర ఘట్టాభిషేకం!


**సహస్ర ఘట్టాభిషేకం తిలకించే అర్హులు ఎవరు**

**శాశ్వత దాతలకు అందని ఆహ్వానం**

**తుంగలోకి తొక్కిన ఆగమ శాస్త్ర నిబంధనలు**

**అంతా కలెక్టరేనంటూ తప్పించుకుంటున్న ఈవో**

**ఈ వివాదాలు నా కొద్దంటూ దూరంగా ఉన్న ఎమ్మెల్యే గంటా**



(ఎం. కే. సునీల్ కుమార్ - జయ జయహే బ్యూరో )

రాష్ట్ర ప్రజలందరి చూపు సింహాద్రి నాధుని చందనోత్సవంపైనే ఉంది. ఆ స్వామి వారి నిజరూప దర్శనం కోసం పరితపించిపోతున్నారు. అందుకు విశాఖకు వేలాది మంది భక్తులు ఆదివారమే చేరుకుని స్వామివారి కటాక్షం కోసం నిరీక్షిస్తున్నారు. వైశాఖ శుద్ధ తదియనాడు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జరిగే చందనోత్సవం ఒక ఎత్తయితే...అనంతరం జరిగే వరాహ స్వామి సహస్ర ఘట్టాభిషేకం మరో ఎత్తు. చందనోత్సవం అంతా అయిన తర్వాత జరిగే సహస్ర ఘట్టాభిషేకం ఎంతో అపురూపం. కొద్ది మంది శాశ్వత దాతల సమక్షంలో జరిగే ఈ పవిత్రమైన అభిషేకం ఎంతో ..మిగతా 2లో



## ప్రాజెక్ట్ పునర్విక..!

**మంత్రి లోకేష్ ఆపన్న హస్తం**

**తీవ్ర అనారోగ్య బాధితులకు చేయూత**

(అమరావతి - జయజయహే)

చిన్నారి పునర్విక ప్రాణాలను కాపాడేందుకు రూ.16 కోట్ల ఇంజెక్షన్ అవసరమైన పరిస్థితి భవిష్యత్తులో మరెవరూ ఎదుర్కొనకూడదనే సంకల్పంగా మారింది. విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనను ఒక ..మిగతా 2లో



## ఫేక్ కంటెంట్ తొలగించాల్సిందే

**సోషల్ మీడియా ప్లాట్ ఫాంలకు ఆదేశాలు**

**ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ ఈసీ కీలక ఆదేశాలు**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)


తమిళనాడు, కేరళ, బంగాల్, అసోం, పుదుచ్చేరిలలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ప్రకటన చేసింది. తమ దృష్టికి వచ్చిన 3 గంటల్లోగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి నకిలీ కంటెంట్‌ను రాజకీయ పార్టీలు తొలగించాలని పునరుద్ఘాటించింది. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో మార్చి 15న ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినప్పటి నుంచి ఇప్పటిదాకా 11వేలకుపైగా ఫేక్ కంటెంట్‌లతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు, యూఆర్‌ఎల్‌లను గుర్తించి చర్యలు తీసుకున్నామని ..మిగతా 2లో

## హంగామా నేతలది

# భారం భక్తులది

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

సింహాచల క్షేత్రంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించే చందనోత్సవం భక్తి వైభవాలకు నిలువుటద్దం. అయితే ఇటీవలి పరిణామాలు భక్తుల భద్రతపై పెను అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ప్రతి ఏటా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఘనంగా ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. భక్తుల రక్షణ విషయంలో జరుగుతున్న వరుస వైఫల్యాలు యంత్రాంగం బాధ్యతారాహిత్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా భక్తుల ప్రాణాలకు భరోసా ఇచ్చే చర్యలు చేపట్టడంలో యంత్రాంగం విఫలమవుతోంది. ముఖ్యంగా 2025 ఏప్రిల్ 29--30 తేదీలలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదం భక్తులను ఇప్పటికీ భయభ్రాంతులకు గురిచేస్తోంది. చందనోత్సవ వేళ నిజరూప దర్శన క్యూలైన్ సమీపంలో సుమారు 20--25 అడుగుల పొడవున్న నూతన గోడ ఒక్కసారిగా కూలిపోవడం గమనార్హం. కేవలం ఇరవై రోజుల క్రితమే అత్యంత వేగంగా నిర్మించిన ఆ గోడ నేలమట్టం కావడం పరిపాలన నిర్లక్ష్యానికి ..మిగతా 2లో









## ఆత్మీయ రాజకీయం

**విజయమ్మకు బర్త్ డే విష్ చేసిన లోకేశ్**

**పవన్ కళ్యాణ్ వేగంగా కోలుకోవాలని జగన్ ఆకాంక్ష**

(అమరావతి - జయజయహే)

రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సాధారణంగా పరస్పరం విమర్శలు చేసుకునే అధికార, విపక్ష నేతలు.. ఈసారి సోషల్ మీడియా వేదికగా పరస్పరం శుభాకాంక్షలు, పరామర్శలు ..మిగతా 2లో

# అప్పన్నకు శఠగోపం... అప్పనంగాళ్లకు సహస్ర ఘట్టాభిషేకం!

మొదటి పేజీ తరువాయి...

విశిష్టమైన అరుదైన వైభవ సేవ. అత్యంత అరుదుగా జరిగే ఇలాంటి అభిషేకాలను వందలాది మంది అర్చక స్వాములు వేద మంత్రాల మధ్య చేసే విధానం వర్ణించలేనిది. సహస్ర అంటే వెయ్యి...ఘట్టం అంటే పాత్రలు(కలశాలు)...అంటే వెయ్యి పవిత్ర కలశాల నీటితో స్వామి వారికి అభిషేకం చేయడం చూస్తుంటే ఎంతటి వారైనా భక్తిపారవశ్యంతో పరవశించిపోవడమే..అంతటి మహత్కరమైన దివ్య దర్శనం...అభిషేకం ద్వారా లక్షలాది మంది భక్తులు వరాహ స్వామిని శత్రువుల నుంచి రక్షణ..ఆరోగ్యం...సంపద ఇవ్వాలని కోరుకుంటారు. వరాహ స్వామి ఎప్పుడూ చందనంతో కప్పబడి ఉంటారు. సహస్ర ఘట్టాభిషేకం సమయంలోనే ఆ చందనం తొలగించి అసలు రూపానికి సహస్ర అభిషేకం చేయడం చాలా ప్రత్యేకం. ఈ సహస్ర ఘట్టాభిషేకం సేవలో పాల్గొంటే పాప పరిహారంతో పాటు శాంతి...ఐశ్వర్యం లభిస్తాయన్న విశ్వాసం భక్తుల్లో బలీయంగా నాటుకుపోయింది. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ ఘట్టాభిషేకం చూసేందుకు అర్హులు ఎవరన్న దానిపై ఎవరికి వారే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. సింహాచలంలో గత ఈవో ప్రేమకుమార్ హాయంకు ముందు వరకూ ఇలాంటి అరుదైన ఘట్టాలను తిలకించేందుకు



శాశ్వత దాతలను మాత్రమే అనుమతించేవారు. కానీ ఇటీవల కాలంలో అలాంటి సంప్రదాయాలను పక్కన పెట్టి తమ బంధుగణ వర్గాలతో నింపేస్తున్నారన్న అపవాదు భక్తులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. దేవస్థానానికి చెందిన కొందరు అధికారులు...అర్చక స్వాములు కలసి నకిలీ దాతలతో ఈ తంతు నిర్వహించడం ఆనవాయితీగా మారిపోయిందని ఎద్దేవా చేస్తున్నారు. శాశ్వత దాతలు అంటే అన్నదానానికి...మరో కార్యక్రమానికి డబ్బులు ఇచ్చే దాతలు కాదన్నది దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పూర్వీకుల నుంచి శాశ్వత దాతలుగా వెలుగొందుతున్న వారి వద్ద అప్పట్లో దేవాదాయ శాఖ ఇచ్చిన కార్డులున్నాయి. వారు మాత్రమే ఈ ఘట్టాభిషేకానికి అర్హులన్నది సుస్పష్టం. కానీ అర్చక స్వాములు...ఆలయ అధికారులు...తమ వారిని వెంటేసుకుని మరీ ఈ సహస్ర ఘట్టాభిషేకానికి హాజరు కావడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. ఇదిలా ఉంటే ఈ చందనోత్సవం...సహస్ర ఘట్టాభిషేకానికి సంబంధించిన అంశాలపై ఆలయ ఈవో మాత్రం తప్పించుకుంటున్నారు. అంతా కలెక్టరే చూసుకుంటున్నారని...తాను నిమిత్తమాత్రుడునని చెప్పుకుంటున్నారు. మరో పక్క ఆలయ తలనొప్పులు తనకెందుకులే అనుకున్నారో ఏమో గానీ స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా చందనోత్సవ ఏర్పాట్లపై దూరంగానే ఉంటున్నారు. మంత్రులు...ఇతర అధికారుల సమీక్షలకు కూడా ఆయన దూరంగానే ఉన్నారు.



# ప్రాజెక్ట్ పునర్విక..!

మొదటి పేజీ తరువాయి...

సామాజిక ఉద్యమంగా తీర్చిదిద్దే నిర్ణయం తీసుకున్నారు. సమస్య పరిష్కారం ఒక్కరికే పరిమితం కాకుండా, వేలాది అరుదైన వ్యాధులతో పోరాడుతున్న చిన్నారులకు ఆశనిచ్చే దిశగా "ప్రాజెక్ట్ పునర్విక"ను ప్రకటించారు. అత్యంత ఖరీదైన చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం, గ్లోబల్ సంస్థలు, దేశీయ కంపెనీలతో సమన్వయం చేసే సమగ్ర ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. "చిన్నారుల జీవితం డబ్బుతో ముడిపడకూడదు" అనే స్పష్టమైన లక్ష్యంతో ప్రాజెక్ట్ పునర్వికకు మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. 11 నెలల చిన్నారి పునర్వికకు ప్రాణరక్షక ఇంజెక్షన్ ఇవ్వడం ప్రత్యక్షంగా చూసిన క్షణం ఆయనను లోతుగా కదిలించింది. చిన్న శరీరం కానీ అద్భుతమైన పోరాటం. సాధారణ జీవితం కోసం ఆ చిన్నారి చేసిన నిశ్శబ్ద పోరాటం ఒక పెద్ద సందేశంగా మారింది. కొద్ది రోజుల్లోనే పునర్విక కథ దేశవ్యాప్తంగా భావోద్వేగ తరంగాన్ని సృష్టించింది. ప్రజలు తమ పిల్లలనే ఆమెలో చూసుకుని ప్రార్థనలు, విరాళాలతో ముందుకొచ్చారు.

ఒక్క ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరం అనే వాస్తవం మంత్రి లోకేశ్‌ను ఆలోచింపజేసింది. ఇక్కడే ఆయన స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు తమ పిల్లలనే ఆమెలో చూసుకుని ప్రార్థనలు, విరాళాలు, మద్దతుతో ముందుకొచ్చారు. ఒకే ఒక్క ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరం అనే వాస్తవం లోకేశ్‌ను ఆశ్చర్యపరిచింది. ఈ సంఘటనతో ఒక్క పిల్లకే సహాయం చేయడం సరిపోదని నిర్ణయించుకున్నారు. ఈ ఔషధాల వెనుక ఉన్న వ్యవస్థను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఆయన స్వయంగా ప్రయత్నించారు. తయారీ విధానం నుంచి దిగుమతి ప్రక్రియ వరకు, ఖర్చులు ఎందుకు అంత అధికం అవుతున్నాయో లోతుగా అధ్యయనం చేశారు.

# ఫేక్ కంటెంట్ తొలగించాల్సిందే

మొదటి పేజీ తరువాయి...


ఈసీ వెల్లడించింది. ఆయా ఫేక్ కంటెంట్‌లను తొలగించి, వాటిని పోస్ట్ చేసిన వారిపై పోలీసు స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయించామని ఈసీ పేర్కొంది. వీటిపై బాధ్యుల నుంచి వివరణలు, ఖండనలను స్వీకరించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. సోషల్ మీడియా, ఏఐ జనరేటెడ్ కంటెంట్‌లతో ముడిపడిన చట్టపరమైన నిబంధనలను రాజకీయ పార్టీలన్నీ తు.చ తప్పకుండా పాటించేలా ఎన్నికలు జరుగుతున్న అన్నిచోట్లా పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పింది.

**3,10,393 ఫిర్యాదుల పరిష్కారం**

మార్చి 15 నుంచి ఇప్పటివరకు తమిళనాడు, కేరళ, బంగాల్, అసోం, పుదుచ్చేరిలలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన 3,10,393 ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఈసీ తెలిపింది. వీటిలో దాదాపు 96.01 శాతం పరిష్కారాలను, ఫిర్యాదు అందిన 100 నిమిషాలలోపే సాధించామని పేర్కొంది. ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సీ -విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తమకు సమాచారాన్ని అందించారని చెప్పింది.

"రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రచార ప్రతినిధులు ఒకవేళ సోషల్ మీడియా వేదికల్లో ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను పోస్ట్ చేస్తే కచ్చితంగా దానికి ఏఐ జనరేటెడ్ లేదా సింథటిక్ కంటెంట్ లేదా డిజిటల్లీ ఎన్‌హ్యాన్స్‌డ్ లేదా ఏఐ ఆల్టర్డ్ కంటెంట్ అనే లేబుల్‌ను వినియోగించాలి. దీంతోపాటు ఆ పోస్ట్ చేస్తున్న సంస్థ వివరాలనూ బహిర్గతపర్చాలి. ఎన్నికల పారదర్శకత, ఓటర్ల విశ్వాసాన్ని పొందేందుకు ఇవన్నీ చేయాల్సిందే. అసోం, కేరళ, బంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిలలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించేలా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఉండే పోస్టులను ఐటీ చట్టం కింద నోటిఫై చేయబడిన ఐటీ నోడల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వాటిపై చర్యలు తీసుకుంటున్నారు. అన్ని చోట్లా పోలింగ్ తేదీలకు ముందు 48 గంటల పాటు కచ్చితంగా నిశ్శబ్ద కాలాన్ని పాటించాలి. ఈ వ్యవధిలో ఏ రూపంలోనూ అభ్యర్థులు, పార్టీలు ఎన్నికల ప్రచారం చేయకూడదు. దీన్ని మీడియా వేదికలు, టీవీ ఛానళ్లు, రేడియోలు, పత్రికలు, సోషల్ మీడియా పాటించాల్సిందే" అని ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది.





# స్వామి నిజస్వరూపాన్ని భక్తులకు సాక్షాత్కరించిన పాశర్ల

**విశాఖపట్నం (జయ జయహే)**

1967సంవత్సరంలో సింహాచలం దేవస్థానంలో గుమస్తా ఉద్యోగం చేస్తున్న పాశర్ల సూర్యనారాయణ అప్పటి ప్రధాన అర్చకులు కోయిల కందాడై వీర రాఘవచార్యులు ఆదేశం మేరకు స్వతహాగా చిత్రకారుడైన పాశర్ల సూర్యనారాయణ ని చందన యాత్ర రోజున స్వామి పై ఉన్న చందనాన్ని తొలగించిన తర్వాత సుమారు రాత్రి ఒంటిగంట నుంచి మూడు గంటల మధ్యలో గర్భాలయంలో కూర్చోబెట్టి స్వామివారి చిత్రాన్ని గీసి స్వామివారి నిజస్వరూపాన్ని భక్తులకు సాక్షాత్కరించిన ధన్యజీవి పాశర్ల సూర్యనారాయణ,

# చెన్నై నగరం కోసం.. సూపర్ సిక్స్ హామీలు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓటర్లపై హామీల వర్షం కురిపించిన అధికార డీఎంకే పార్టీ.. తాజాగా చెన్నై వాసుల మనసులూ గెలుచుకునేం దుకు ప్రత్యేక మ్యానిఫెస్టోను ప్రకటించింది. 'చెన్నై సూపర్-6' పేరిట నగర ఓటర్లను ఆకట్టుకునేలా పలు హామీలు తీసుకొచ్చింది. తమిళనాడు ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ పార్టీ ప్రధాన కార్యాలయంలో దీన్ని ఆదివారం ఆవిష్కరి ంచారు. నగరవాసుల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రత్యేక మ్యానిఫెస్టో తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. చెన్నై సూపర్-6లో ఆరు అంశాలను డీఎంకే ప్రస్తావించింది. నగరంలో సౌకర్యాలు మెరుగు పరచడం, వెయ్యి మినీ బస్సులు, ఏఐ సాయంతో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయం తగ్గించడం వంటివి ఇందులో ఉన్నాయి. నీటి కాలువలు, కీలక రహదారి ప్రాజెక్టులు పూర్తి చేయడం, రహదారుల వెంబడి చెట్ల పెంపకం, ప్రపంచ స్థాయి సదుపాయాల కల్పన వంటి హామీలు ఇచ్చింది. మెట్రో రైలు విస్తరణ, వీధి కుక్కల నియంత్రణ, వెటర్నరీ డాక్టర్ల సంఖ్యను మూడింతలు చేయడం, క్షేత్రస్థాయి సిబ్బంది పెంచడం వంటివీ జోడించింది. యువతను ఆకట్టుకోవడానికి రూ.10వేల కోట్ల టెక్నాలజీ హబ్ ఏర్పాటు వంటి హామీలు గుప్పించింది.తమిళనాడులో ఎన్నికలు ఒక ఎత్తైతే రాజధాని చెన్నైలో పోరు మరో ఎత్తు. ఇక్కడ పట్టు సాధిస్తే ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సులువని రాజకీయ విశ్లేషకులు చెప్పే మాట. అందుకే అన్ని పార్టీలు హోరాహోరీగా తల పడుతున్నాయి. ఈ క్రమంలోనే డీఎంకే ప్రత్యేక మ్యానిఫెస్టో తీసుకురావడం గమనార్హం. గ్రేటర్ చెన్నై పరిధిలోని 22 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో డీఎంకే ఏకంగా 20 స్థానాల్లో పోటీ చేస్తోంది. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మరో ముగ్గురు ఇందులో ఉన్నారు. ఎన్డీయేలో అన్నాడీఎంకే 18 చోట్ల బరిలోకి దిగగా.. టీవీకే అధినేత విజయ్ ఇక్కడ పోటీ చేస్తుండటంతో పాటు పలుచోట్ల అభ్యర్థులను బరిలో ఉంచింది. ఏప్రిల్ 23న తమిళనాట ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.



# బోటింగ్ క్రీడాకారులను సత్కరించిన ఆడారి కిషోర్ కుమార్

**విశాఖపట్నం, ఏప్రిల్ 19, జయ జయహే :**

మిషన్ కర్షకదేవోభవ జాతీయ ఛైర్మన్ డాక్టర్ ఆడారి కిషోర్ కుమార్ రుషికొండలోని విశాఖ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి, విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి బోటింగ్ మరియు కయాకింగ్ పోటీల్లో పాల్గొన్న జూనియర్ విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిన్నారులను తీర్చిదిద్దుతున్న కోచ్ దాసు కృషిని అభినందించారు. ఈ పిల్లలలో ఎక్కువ మంది గంగపుత్ర సమాజానికి చెందినవారని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చినప్పటికీ ప్రతిభతో ముందుకు వస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఈ చిన్నారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి విశాఖకు గర్వకారణంగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వీరికి స్పాన్సర్‌షిప్ అందించాలని సంస్థలు, దాతలను కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పతకాలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ దాసు, పెన్సాక్ సిలాట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరావు, పెడ్ లక్ష్మి, వంశీ, భాస్కరరావు మరియు స్థానికులు పాల్గొన్నారు



# తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

మొదటి పేజీ తరువాయి...

వంటి అంశాల్లో పార్టీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దాలని వారికి దిశానిర్దేశం చేశారు. ఈనెల 29వ తేదీన టీడీపీ కొత్త కార్యవర్గం బాధ్యతల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నేతలు తెలిపారు. మహానాడు నిర్వహణకు సంబంధించిన కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబుకు టీడీపీ నేతలు వివరించారు.

# హంగామా నేతలది భారం భక్తులది

మొదటి పేజీ తరువాయి...

సజీవ సాక్ష్యం. ఈ దుర్ఘటనలో 7--8 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. భారీ వర్షం, గాలుల కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు సమర్థించుకున్నప్పటికీ, నాసిరకం నిర్మాణమే ఇందుకు ప్రధాన కారణమనే ఆగ్రహం ప్రజల్లో వ్యక్తమైంది. ప్రభుత్వం విచారణ జరిపి కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు జరిగిన నష్టాన్ని ఆ చర్యలు పూడ్చలేవు. కాంట్రాక్టర్ల లాభాపేక్ష, పర్యవేక్షణ లోపం అమాయక భక్తుల ప్రాణాలను బలితీసుకున్నాయి.

ఇది ఏదో ఒక సందర్భంలో జరిగిన వివిక్త సంఘటన కాదు. గతంలోనూ రద్దీ నియంత్రణలో వైఫల్యాలు, క్యూలైన్లలో తోపులాటలు, కనీస వసతుల కొరత వంటి సమస్యలు పదేపదే పునరావృతమవుతున్నాయి. వృద్ధులు, పసిపిల్లలతో వచ్చే భక్తులు గంటల తరబడి సరైన నీడ, తాగునీరు లేక అవస్థలు పడటం నిత్యకృత్యమైంది. వేలాది మంది తరలివచ్చే ఉత్సవాల్లో కనీస ప్రాథమిక చికిత్స కేంద్రాలు కూడా అందుబాటులో లేకపోవడం శోచనీయం. ఈ వ్యవస్థాత్మక లోపాలు భక్తుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. తొక్కిసలాటలు జరిగినప్పుడు తక్షణమే స్పందించే విపత్తు నిర్వహణ బృందాల కొరత స్పష్టంగా కనిపిస్తోంది.

మరో బాధాకరమైన అంశం ఏమిటంటే, సామాన్య భక్తుల కంటే ప్రముఖులకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం. రాజకీయ నాయకులు, ధనవంతులు భారీ కాన్వాయ్‌లతో వచ్చి నిమిషాల్లో దర్శనాలు పూర్తి చేసుకుంటుంటే, మండుటెండలో, వానలో గంటల తరబడి వేచి ఉండే సామాన్యులను భద్రత పేరుతో నిలిపివేస్తున్నారు. ఆధ్యాత్మిక ఆనందం కోసం అన్ని కష్టాలను ఓర్చుకుని వచ్చే సామాన్య భక్తుడు, ఆలయ పరిసరాల్లో ప్రముఖుల కోసం చేసే హడావిడి చూసి తీవ్ర నిరాశకు లోనవుతున్నాడు. దేవుని చెంత అందరూ సమానమే అన్న భావన కార్యరూపంలో కనిపించకపోవడం విచారకరం. వికలాంగులు, గర్భిణీలు క్యూలైన్లలో ఇబ్బంది పడుతున్నా పట్టించుకోని యంత్రాంగం, అధికారగణం కోసం ఎర్ర తివాచీలు పరచడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోంది. ప్రముఖుల రాక వల్ల సామాన్య భక్తులు నిలబడే క్యూలైన్లను గంటల తరబడి నిలిపివేయడం వల్ల తోపులాటలు జరిగి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. భక్తి భావంతో వచ్చే భక్తులకు కనీస గౌరవం ఇవ్వకపోవడం, కేవలం అధికారం ఉన్న వారికే పెద్దపీట వేయడం వల్ల ఆలయ పవిత్రత దెబ్బతింటోంది. ప్రజాస్వామ్య దేశంలో దైవ దర్శనం అందరికీ సమాన హక్కు అయినప్పటికీ, ఆచరణలో మాత్రం ధనిక, పేద వర్గాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రోటోకాల్ పేరుతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలి. సామాన్య భక్తుడి సహనాన్ని పరీక్షించకుండా, దర్శన ప్రక్రియలో సమానత్వాన్ని పాటిస్తేనే భక్తులకు నిజమైన తృప్తి కలుగుతుంది. విఐపి సంస్కృతిని నియంత్రించి, ప్రతి ఒక్కరికీ ప్రశాంతమైన దర్శనం కల్పించడమే ఆలయ అధికారుల ప్రధాన బాధ్యత కావాలి. అంతేకాకుండా ప్రజల సేవ కోసమే తామున్నామన్న సంగతిని గుర్తుంచుకొని నేతలు సైతం మరింత బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా వుంది. మొదట ప్రాధాన్యత భక్తులకు, తర్వాత మాత్రమే తమకు అన్న భావన నేతలలో కనిపించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులుగా ఉండాలి తప్ప, దైవ దర్శనంలో సామాన్యులకు ఆటంకం కలిగించకూడదు. ఆలయ యంత్రాంగం భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణంలోనూ నాణ్యతను తనిఖీ చేయాలి. క్యూలైన్ల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తూ, రద్దీని నియంత్రించేందుకు ఆధునిక సాంకేతికతను వాడాలి. వైద్య సదుపాయాలు, తాగునీరు, విశ్రాంతి గదులు ప్రతి భక్తుడికి అందుబాటులో ఉండేలా చూడాలి. ముఖ్యంగా వేసవి కాలంలో జరిగే ఉత్సవం కాబట్టి చలవ పందిళ్లు, తడి తివాచీలు ఏర్పాటు చేయాలి. ప్రముఖుల దర్శనాల కోసం ప్రత్యేక సమయాలను కేటాయించి, సాధారణ భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్త పడాలి. క్యూలైన్ల పొడవును బట్టి ఎక్కడికక్కడ సిబ్బందిని నియమించి భక్తులకు అవసరమైన సమాచారాన్ని అందించాలి.చందనోత్సవం వంటి పవిత్ర ఉత్సవాలు భక్తుల ప్రాణాలకు గ్యారంటీ ఇచ్చే విధంగా సాగాలి. యంత్రాంగం తన దృష్టిని ప్రముఖుల సేవల నుంచి మళ్లించి, సామాన్య భక్తుడి భద్రతను కేంద్రబిందువుగా చేసుకున్నప్పుడే ఈ క్షేత్రానికి నిజమైన వైభవం చేకూరుతుంది. భవిష్యత్తులో ఇలాంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి. భక్తుడు ఇచ్చే కానుకలతో నడిచే దేవస్థానం, అదే భక్తుడి ప్రాణాలకు కనీస గౌరవం ఇవ్వాలి. అధికారుల జవాబుదారీతనం పెరిగినప్పుడే సింహాద్రి అప్పన్న దర్శనం భక్తులకు మధురానుభూతిని మిగుల్చుతుంది.

# ఆత్మీయ రాజకీయం

మొదటి పేజీ తరువాయి...

తెలియజేస్తూ భిన్నమైన సందేశం ఇస్తున్నారు. ఒకవైపు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. వైఎస్సార్ కుటుంబానికి చెందిన వైఎస్ విజయమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. సాధారణంగా రాజకీయ విభేదాలు ఉన్నా.. ఈ శుభాకాంక్షలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై స్పందించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు. రాజకీయంగా విభిన్న ధోరణులు ఉన్నా.. వ్యక్తిగత ఆరోగ్యంపై పరామర్శించడం సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. ఇటీవల రాజకీయాల్లో పదునైన విమర్శలు, ఆరోపణలు పెరుగుతున్న సమయంలో.. ఇలాంటి ట్వీట్లు కొంత భిన్నంగా కనిపిస్తున్నాయి. విభేదాలు ఉన్నా.. వ్యక్తిగత అంశాల్లో పరస్పరం గౌరవం చూపడం రాజకీయాల్లో అరుదుగా కనిపించే పరిణామంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఏపీలో ఇలాంటి సీన్స్ చాలా అరుదు అని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి.. సోషల్ మీడియా వేదికగా వెలువడిన ఈ ట్వీట్లు రాజకీయాల్లో మరో కోణాన్ని చూపించాయి. విభేదాల మధ్య కూడా మానవీయ విలువలు నిలుస్తున్నాయనే సంకేతాన్ని ఇవి ఇస్తున్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో

# ఉషోదయ కళాశాలలకు అరుదైన గౌరవం

**చోడవరం ఏప్రిల్ 19 జయ జయహే**



విశాఖలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల లో భాగంగ జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ అనుబంధ కళాశాల అవార్డులు కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలలో చోడవరం ఉషోదయ విద్యాసంస్థలు విశిష్ట ప్రతిభ కనబరిచి పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకున్నాయి.ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఉన్న మొత్తం 59 బీఈడీ, ఎంఈడీ కళాశాలలలో, ఉషోదయ ఎంఈడీ , బీఈడీ కళాశాల ఏకైక ఉత్తమ ఎంఈడీ , బీఈడీ కళాశాలగా అవార్డు పొందింది.ఇది ఆ కళాశాల విద్యా నాణ్యత, శిక్షణా ప్రమాణాలు, పరిశోధనాత్మక దృక్పథం మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేసిన కృషికి లభించిన గొప్ప గుర్తింపుగా భావిస్తున్నారు.అలాగే వ్యక్తిగత ప్రతిభకు గాను పలువురు ప్రిన్సిపల్స్ అధ్యాపకులు గౌరవించబడ్డారు:బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డా ఎం.వి.యస్.ఎన్. మూర్తి కి,లాంగ్ సర్వీసింగ్ బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ అవార్డు,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్. ఎన్. నాయుడు కి లాంగ్ సర్వీసింగ్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ అవార్డు,సీనియర్ అధ్యాపకులు ఎస్. వి. వాసు కి ఉత్తమ డిగ్రీ కళాశాల ఫ్యాకల్టీ అవార్డు లభించాయి.అలాగేడా. అప్పలనాయుడు కి ఉత్తమ బీఈడీ కళాశాల ఫ్యాకల్టీ అవార్డు లభించాయి.ఈ అవార్డులను ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతి డా. జి. పి. రాజశేఖర్ , విజ్ఞాన్ యూనివర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య , ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భరత్ నారాయణ గుప్త చేతుల మీదుగా ఘనంగా ప్రదానం చేశారు.ఈ విజయాల సందర్భంగా ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె. రమణాజీ మాట్లాడుతూ ఈ అవార్డులు ఉషోదయ విద్యాసంస్థలలో అమలు చేస్తున్న ఆధునిక బోధన విధానాలు, అనుభవజ్ఞులైన అధ్యాపక వర్గం, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న ప్రత్యేక కార్యక్రమాలకు ప్రతిఫలంగా లభించాయని, “ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఏకైక ఉత్తమ బీఈడీ ఎంఈడీ కళాశాలగా ఎంపిక కావడం మా సంస్థకు గర్వకారణం అని, ఇది మా అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి కృషి ఫలితం” అన్నారు. కరస్పాండెంట్ జె. కృష్ణకుమారి , డైరెక్టర్ జై శ్యామ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా విద్యా నాణ్యతను మరింత పెంచుతూ రాష్ట్ర స్థాయిలోనే కాక జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.



## స్మార్ట్ కిచెన్ పేరుతో భోజన కార్మికులకు

# అన్యాయం చేయవద్దు

**చోడవరం ఏప్రిల్ 19 జయ జయహే**

మధ్యాహ్న భోజన పథకాన్ని స్మార్ట్ కిచెన్ల పేరుతో కార్మికులకు అన్యాయం చేయొద్దని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎం ఎస్ రాజుకు మధ్యాహ్నం భోజనం కార్మికులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. 23 ఏళ్లుగా ఈ పథకంలో ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా పనిచేస్తున్న కార్మికుల్ని తొలగించి అక్షయపాత్రకి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని రద్దు చేయాలని, మా ఉపాధి కొట్టొద్దని, ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులు పేదవాళ్ళని, అలాంటి పేద మహిళల పొట్టలు కొట్టొద్దని చెబుతూ మా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ బుచ్చిరాజమ్మ, ఎర్రయ్యమ్మ, రూప, బుజ్జి, హసీనా ,సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.



# చెత్త చేసిన రహదార్లు స్వచ్ఛభారత్ ఊసే లేదు

### పారిశుద్ధ్యం కరువు రోగాలకు నెలవు

### ఎన్టీఆర్ కాలనీలో నిత్యం చెత్త మయం

**టెక్కలి ఏప్రిల్ 19 జయ జయహే**

అభివృద్ధి సుందరీకరణ దిశగా అడుగులు వేస్తున్న టెక్కలి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నిత్యం పాదచారులకు చెత్త కూ పాలు స్వాగతం పలుకుతున్నాయి, కూటమి ప్రభుత్వం పట్టణ సుందరీకరణ లో భాగంగా రహదారులు, పార్కులు, మొక్కలు పెంపకం చేపట్టి ఆరోగ్యవంతమైన పట్టణం తయారు కావాలని ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ఉన్నతమైన లక్ష్యము కృషితో ప్రతి ఇరుకు వీధుల్లో శాశ్వతమైన రహదారులు నిర్మాణాలు చేసి ప్రజా ఆరోగ్యానికి మేలు చేసే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి స్థానికుల మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుంటే మన వీధులను చెత్తతో నింపే కలుషిత వాతావరణం తయారు చేయడం భావ్యం కాదని స్థానిక సమాజ హితవరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి పురవీధుల్లో చెత్తను నేరుగా రహదారులపై వేయడం నిషేధించే చర్యలు పంచాయితీ అధికారులు తీసుకోవలసిన అవసరం ఎంతో ఉంది, నిత్యం పారిశుద్ధ్యం కార్యక్రమాలు చేపట్టి స్వచ్ఛభారత్ కార్యక్రమాలను పటిష్టంగా అమలుపరిచి పరిశుభ్రత పచ్చదనం పై అవగాహన కల్పించి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు తెలియజేసి టెక్కలి నీ సుందర పట్టణముగా తీర్చిదిద్దినంలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమని స్థానికులు భావిస్తున్నారు.



# కాలువల నిర్మాణ పనులు ప్రారంభం

**అగనంపూడి జయ జయహే**

జీవీఎంసీ 85 వార్డ్ లో గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే పల్ల శ్రీనివాసరావు, 85వ వార్డ్ కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ సహకారంతో జీవీఎంసీ కొండయ్యవలస గ్రామం వీధి కాలువ నిర్మాణం పనులు ప్రారంభించడం జరిగినది. ఏడీసీ చైర్మన బలిరెడ్డి సత్యనారాయణ, 85 వార్డు తెలుగు యువత అధ్యక్షులు బండారు చందు రమేష్ టిడిపి నాయకులు పలక అచ్యుత్ జనసేన పార్టీ నాయకులు బైలపూడి విజయ్ విందుల కళ్యాణ్ మల్లపురెడ్డి శివ బి సత్యనారాయణ బలిరెడ్డి అప్పారావు సందర్శించారు



# పదోవ వార్డు అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న రాజుల నాయుడు

**నర్సీపట్నం - జయ జయహే ప్రత్యేక ప్రతినిధి :**

పదోవ వార్డు అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ. అభివృద్ధి లక్ష్యంగా డ్రైనేజీ , రోడ్లు , తాగునీటి సమస్యలను సకాలంలో గుర్తించి సమస్యలను పరిష్కరిస్తూ , వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటున్న పదోవ వార్డు మాజీ కౌన్సిలర్ రాజుల నాయుడు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు , చింతకాయల పద్మావతి సహాయ సహకారులతో వీఎం ఆర్ డిఏ నిధులతో సుమారు 8 లక్షల రూపాయలు పదోవవార్డుకి మంజూరు చేయడం జరిగిందన్నారు. విశాఖ డైరీ వెనక భాగాన ఆపరేషన్ కాలనీలోని బొమ్మరాజు ఇంటి వద్ద నుండి గాజుల రమణ ఇంటి వరకు సిమెంటు రహదారి , మురికి కాలవకు పదోవ వార్డు మాజీ కౌన్సిలర్ రాజుల నాయుడు ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుల నాయుడు మాట్లాడుతూ పదోవ వాడు ప్రజలు నాపై నమ్మకం ఉంచి కౌన్సిలర్ గా గెలిపించినందుకు ముందుగా వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వం హాయంలో కూడా ప్రజలను నన్ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. నా వార్డు ప్రజల కోసం వార్డులో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తూ ప్రజా శ్రేయస్సు కోసం తన వంతు సహకారాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. నన్ను గుర్తించి ఆదరించిన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ , పట్టణ అధ్యక్షుడు రాజేష్ బాబుకి రుణపడి ఉంటారని ఈ సందర్భంగా తెలియజేశారు.




# మాజీ ఎంపీ మార్గాని భరత్‌పై బుచ్చయ్య చౌదరి ఫైర్

### అభివృద్ధి అడ్డుకున్నారని ఆరోపణలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్‌పై రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భరత్ తన పదవీకాలంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్లక్ష్యం చేసి నగరానికి నష్టం కలిగించారని ఆరోపించారు. బైపాస్ ప్రాజెక్టును రద్దు చేయడం వల్ల నగర ట్రాఫిక్ సమస్యలు పెరిగాయని, ప్రమాదాలు కూడా అధికమయ్యాయని ఆయన విమర్శించారు. ఆ ప్రాజెక్టు పూర్తి అయి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని అన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సహకారంతో ఫ్లైఓవర్‌కు అనుమతి తీసుకువచ్చామని వెల్లడించారు. నగర అభివృద్ధి పేరుతో మ్యూజికల్ ఫౌంటెన్ వంటి పనులకు లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు ఉపయోగం లేకుండా చేశారని, కంబాల చెరువు అభివృద్ధిని కూడా దెబ్బతీశారని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన నిధులను సరైన విధంగా వినియోగించలేదని అన్నారు. భరత్ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇలాంటి చర్యలు వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరుగుతోందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు అభివృద్ధి దిశగా దూసుకుపోతున్నాయని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, మచ్చేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి దాతలకు సత్కారం

**మాడుగుల ఏప్రిల్ 19 జయ జయహే**

మాడుగుల మండల ప్రాథమిక పాఠశాల (గెడ్డ బడి) అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కళావేదిక నిర్మాణానికి 40 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన పాఠశాల పూర్వ విద్యార్థి పుట్టా నాగేంద్ర నీ ఎంపీపీ రాజారాం చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.అలాగే ఈ పాఠశాల అభివృద్ధికి ఎప్పటికప్పుడు సహకరశీ అందిస్తున్న పూర్వ విద్యార్థులకు, దాతలకు వారు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎడ్ల కళావతి,వాసవి క్లబ్ ఐపిసి ఎస్ శ్రీనివాసరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ, కోఆప్షన్ నెంబరు షేక్ ఉన్నిషా, విశ్రాంత ఉపాధ్యాయుడు కే కొండలరావు, ఎస్ఎంసి చైర్మన్ పుట్ట కొండలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాసరావు, సహోపాధ్యాయులు ఎస్. సూర్య నారాయణ, బి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి శ్రీకర్‌ను సత్కరించిన ఎంపీపీ

**మాడుగుల ఏప్రిల్19 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపీ బ్రాగ్ సెట్ లో మాడుగుల ఎంపీపీ పాఠశాల (గెడ్డబడి) లో చదువుతున్న 5వ తరగతి విద్యార్థి కే. మధు రామ్ శ్రీకర్ 41/50 మార్కులతో రాష్ట్రస్థాయిలో 7 ర్యాంక్ సాధించిన నేపథ్యంలో శనివారం రాత్రి గేడ్డ బడిలో కార్యక్రమంలో ఎంపీపీ టీవి రాజారాం ఆ విద్యార్థిని సాల్వో సత్కరించి అభినందించారు. ఈ విద్యార్థిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని వచ్చే యాడాది మరి కొంతమంది విద్యార్థులు సత్ఫలితాలు పొందాలని ఆసాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ వై కలావతి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ తదితరులు విద్యార్థి శ్రీ కరణ్ ను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల హెచ్ఎం కే శ్రీనివాసరావును, సహ ఉపాధ్యాయుడు ఎస్ సూర్యనారాయణ ను అభినందించారు.

For a pure tomorrow.. జయహో



# జగన్-బాబు ఒకే మాట

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విభేదాలే సాధారణం. కానీ కొన్ని సందర్భాల్లో ఆ విభేదాల్ని దాటి నాయకులు ఒకే వేదికపై నిలబడితే అది రాజకీయ పరిణామాల్లో విశేషంగా నిలుస్తుంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరియు నారా చంద్రబాబు నాయుడు ఇద్దరూ ఒకే విధమైన మద్దతు వ్యక్తం చేయడం అలాంటి అరుదైన సందర్భంగా చెప్పుకోవచ్చు.

ఇది కేవలం ఒక రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు; సమాజంలో మహిళల స్థానాన్ని బలపరిచే దిశగా తీసుకున్న కీలక అడుగు. సాధారణంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర విమర్శలు, వ్యతిరేకతలు కొనసాగుతుంటాయి. కానీ మహిళల సాధికారత అనే అంశంపై ఇద్దరు నాయకులు ఒకే భావజాలంతో ముందుకు రావడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సంకేతం.

మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది ఎన్నో సంవత్సరాలుగా చర్చలో ఉన్న అంశం. శాసనసభలు, పార్లమెంటులో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా నిర్ణయాత్మక ప్రక్రియల్లో వారి భాగస్వామ్యం పెంచడమే దీని లక్ష్యం. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు ప్రధాన రాజకీయ శక్తులు ఒకే అభిప్రాయం వ్యక్తం చేయడం జాతీయ స్థాయిలో కూడా ప్రాముఖ్యత సంతరించుకుంది.పైకి వివిధ అభిప్రాయాలను వ్యక్తం చెస్తూ ఇద్దరూ ప్రకటనలు గుప్పించినా, వారి ప్రకటనల సారాంసం గమనిస్తే రిజర్వేషన్ల్ బిల్లుపై ఇద్దరిదీ ఒకే వైఖరి అన్నది స్పష్టం అవుతోంది.

ఈ నిర్ణయం వెనుక రాజకీయ లెక్కలు కూడా ఉండవచ్చు. మహిళలు ఓటర్లలో కీలక వర్గంగా మారిన నేపథ్యంలో, వారి మద్దతు పొందడం ప్రతి పార్టీకి అవసరం. కానీ దానిని కేవలం ఓటు బ్యాంక్ రాజకీయంగా చూడడం సరైంది కాదు. నిజంగా మహిళల సాధికారతకు కట్టుబడి ఉంటే, ఆ దిశగా క్రమబద్ధమైన చర్యలు తీసుకోవాలి.

ఇద్దరు నాయకుల ఈ సమాన వైఖరి ఒక కొత్త రాజకీయ సంస్కృతికి నాంది కావచ్చు. ప్రజల సమస్యల విషయంలో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేసే ధోరణి ఏర్పడితే, అది రాష్ట్ర అభివృద్ధికి మేలు చేస్తుంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, మహిళా భద్రత వంటి అంశాల్లో కూడా ఇలాంటి సమన్వయం అవసరం.

అయితే మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలో కూడా ఇదే స్ఫూర్తి కనిపించాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చిన తర్వాత, నిజంగా మహిళలకు అవకాశాలు కల్పించబడుతున్నాయా అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీలలోనే మహిళలకు కీలక స్థానాలు ఇవ్వడం, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి.

ఇంకా ఒక కీలక అంశం గమనించాల్సిందే. ఈ నిర్ణయం తాత్కాలిక రాజకీయ లాభాలకు పరిమితం కాకుండా, దీర్ఘకాలిక సామాజిక మార్పుకు దారితీయాలి. మహిళలు కేవలం ప్రతినిధులుగా కాకుండా, విధాన రూపకల్పనలో మార్గదర్శకులుగా ఎదిగే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థపై ఉంది.

ఈ పరిణామం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా గుర్తుచేస్తోంది --- ప్రజాస్వామ్యంలో విభేదాలు సహజమే అయినా, కొన్ని విలువల విషయంలో ఏకాభిప్రాయం అవసరం. మహిళల సాధికారత అలాంటి విలువల్లో ఒకటి. ఈ అంశంపై రాజకీయాలు కాకుండా సామాజిక బాధ్యతతో ముందుకు రావడం నాయకుల నిజమైన గొప్పతనం.

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో విభిన్న దిశల్లో నడిచిన రెండు శక్తులు ఒకే లక్ష్యంపై కలిసిన ఈ సందర్భం, భవిష్యత్తులో మరిన్ని నిర్మాణాత్మక నిర్ణయాలకు దారి తీస్తుందనే ఆశ కలిగిస్తోంది.

# వేసవిలో ఆరోగ్యాన్ని అందించే
# అద్భుతమైన ఫలం తాటి ముంజు
## ఎన్నో పోషకాలు, మరెన్నో ప్రయోజనాలు

పుట్టా శ్రీనివాసరావు

**తాటి ముంజు పేరు చెప్పగానే ప్రతి ఒక్కరికి నోరు ఊరుతుంది. ఇది సీజనల్ ఫలం అయినప్పటికీ దీని రుచి చూడాలని ప్రతి ఒక్కరు ఆశిస్తారు. అలాంటి తాటి ముంజు ఆరోగ్యప్రదాయానీ కూడా. ముఖ్యంగా వేసవిలో ఇది ఎంతో ఉపకరిస్తుంది. ఈ సందర్భంగా తాటి ముంజు ప్రయోజనాల గురించి ఒకసారి తెలుసుకుందాం.**



ఇవి మృదువుగా తీయగా జెల్లిలా ఉంటాయి. మోటో పెట్టుకుంటే ఇట్టే కరిగిపోతాయి. ఈ ముంజులో నీటి శాతం ఎక్కువగా ఉండడంతో వేసవిలో చలువ చేయడంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తది. శరీరానికి అవసరమైన శక్తినీ అందిస్తాయి. వీటిలో విటమిన్ బి7 విటమిన్ కే, విటమిన్ ఎ, సి, డి, పొటాషియం, కాల్షియం, జింకు, ఐరన్, సులేబుల్ ఫైబర్ వంటి అనేక పోషకాలు కలిగి ఉన్నాయి. ఈ పండు తక్కువ క్యాలరీ కలిగి ఉండి శరీరాన్ని వేడి నుంచి ఉపశమనం కలిగించి తక్కువ క్యాలరీలు కలిగి ఉంటాయి. ఇది రక్తపోటును అదుపు చేసి, నజ్జలీకరణం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. డిహైడ్రేషన్ ను నివారించి శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. అలాగే తాటి ముంజల్లో పొటాషియం ఎక్కువ ఉండటం



వల్ల రక్తపోటును నివారణలో సహాయపడతాయి. ముఖ్యంగా స్త్రీలకు గర్భధారణ సమయంలో జీర్ణక్రియలు సమస్యలు తగ్గించేందుకు ఈ తాటి ముంజలు ఎంతో ఉపకారిస్తాయి. మలబద్ధకం ఎసిడిటీ వంటి సమస్యలు నివారణకు కూడా సహాయపడతాయి. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల అధిక బరువు తగ్గించడంలో వీడు పాత్ర ఎంతో ఉంది. శరీరంలో ఉండే విటమిన్లు, మినరల్స్ సమతుల్యంగా ఉండడంతో బరువు తగ్గడానికి సహాయపడతాయి. ఈ తాటి ముంజలు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తొలగించి మంచి కొలెస్ట్రాల్ పెంచడంలో సహాయపడతాయి. అలాగే కాలేయం సంబంధిత వ్యాధులు తగ్గించడంలోనూ ప్రధాని పాత్ర పోషిస్తాయి . వేసవిలో ఎండ వేడిమితో వచ్చే వికారము వాంతులు వంటివి నివారించడంలో ఈ తాటి ముంజలు ఉపయోగపడతాయి. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సమస్యలు నివారణకు ముంజులు పాత్ర ఎంతో ఉంది. ఇవి వివిధ రకాల ట్యూమర్స్, క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసి ఫైటో కెమికల్స్ ను నిర్మూలిస్తాది. ముఖ్యంగా వేసవిలో ఎక్కువ సమయం బయట ఉన్నప్పుడు నీరు కోల్పోయి అలసట వస్తాది. ఆ సమయంలో తాటి ముంజలు తీసుకుంటే అలసట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ తాటి ముంజలను గుజ్జుగా తీసి ముఖానికి రాసుకుంటే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇది చర్మాన్ని తేమగా ఉంచి వ్యాసవుల వచ్చే చెమటకాయలను, ఎండ వేడిమి వల్ల వచ్చే మచ్చలను నివారిస్తుంది. అలాగే ముంజుపై ఉన్న పుట్టులో ఎన్నో రకాల పోషకాలు కలిగి ఉంటాయి. ఈ పొట్టుతో ముంజు తినడం వల్ల శరీరానికి ఎక్కువ చదువు చేయడంతో పాటు మంచి ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. మొత్తం మీద వ్యాసం లభించే ఈ అద్భుత తాటి ముంజు ప్రతి ఒక్కరు రుచి చూసి ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కనుమరుగవుతున్న తాటి చెట్లు.. అంతంతమాత్రంగా ముంజలు**


అయితే రాను రాను కల్పవృక్షంగా పిలవబడే ఈ తాటి చెట్లు కనుమరుగవుతున్నాయిగతంలో గ్రామీణ ప్రాంతంలో ఈ తాటి ముంజలు ఎక్కడికక్కడ కనబడేవి. కానీ నేడు తాటి చెట్లు అంతమవుతుండడంతో ముంజులు కూడా అంతంత మాత్రమే లభిస్తున్నాయి. అవి కూడా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. దీంతో స్థానికులకు అవి అందరిని ద్రాక్షలాగే మారుతున్నాయి. గత ఏడాది ఈ ప్రాంతంలో డజన్ ముంజులు 20 నుంచి 25 రూపాయలకు అమ్మకాలు సాగించగా, ఈ ఏడాది 50 నుంచి 60 రూపాయలకు అమ్మకాలు సాగిస్తున్నారు. అవి కూడా వారానికి ఒకసారి రెండుసార్లు ఒకరిద్దరి దగ్గర లభిస్తున్నాయి. వాటికి కూడా డిమాండ్ పెరగడంతో ముంజుల కోసం ఎదురుచూసే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో మాడుగుల బోయపాడు సిరిజం వంటి ప్రాంతాలకు చెందిన గీత కార్మికులు ఈ తాటి ముంజలను అమ్మకాలు సాగిస్తుంటారు. ఈ ఏడాది ఎండలు మండిపోతుండడంతో పాటు చెట్లు కూడా అంతంత మాత్రమే ఉన్నాయని వారు చెబుతున్నారు. ఎండకి చెట్లు కూడా ఎక్కలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేపథ్యంలో ప్రభుత్వం కూడా తాటి సీట్లు పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సాధారణ చెట్లతో పాటు తాటిచెట్టు పెంపకాన్ని కూడా ప్రోత్సహించాలని కోరుతున్నారు. మరోపక్క ఈ తాటి చెట్లు పెంపకం వల్ల తాటి కలప తాటికమ్మ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. కాబట్టి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సిట్రస్ తోటలపై వ్యాధుల ముప్పు
## ప్రారంభ దశలోనే చర్యలు కీలకం

ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాల్లో బత్తాయి, నిమ్మ తోటలు ప్రస్తుతం పలు ప్రమాదకర వ్యాధుల బారిన పడుతున్నాయి. క్షేత్ర స్థాయిలో ఇటీవల నిర్వహించిన పరిశీలనల్లో పొలుసు పురుగు (స్కేల్ ఇన్సక్ట్ ), బంక తెగులు (గుమ్మోసిస్ ), వేరు కుళ్ళు (ఫసరిమ్ డ్రై రూట్ రోట్ ), పల్లాకు (క్లోరోసిస్ ) వంటి వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్నాయి.

ఈ వ్యాధుల ప్రభావంతో తోటలు నెమ్మదిగా ఎండిపోతూ రైతులకు భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయి.వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.





**సాధారణంగా మొక్కల్లో కనిపించే లక్షణాలు:**

ఆకులు కిందకు వాలిపోవడం, మొక్క ఆకృతి మారడం

నీరు పోసినా మొక్క వాడిపోయినట్లు కనిపించడం

కాండంలో చీలికలు ఏర్పడటం

కాండంపై బంక కారడం లేదా నూనె పూసినట్లుగా కనిపించడం

ఒక వైపు కొమ్మలు పూర్తిగా ఎండిపోవడం

గుబురు పలుచగా మారి కొమ్మలు బయటకు కనిపించడం ఇవి సాధారణంగా కనిపించే లక్షణాలు.

**వ్యాధి నియంత్రణకు పది రోజుల ప్రత్యేక ప్రోటోకాల్**

మొదటి రోజు

వ్యాధి సోకిన లేదా అనుమానం ఉన్న మొక్కల ప్రధాన కాండం మరియు కొమ్మలపై ప్రత్యేక మందుల మిశ్రమాన్ని బ్యాటరీ స్ప్రేయర్‌తో పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

మూడవ రోజు

వ్యాధి సోకిన కొమ్మలను ఒక అడుగు లోపలికి కత్తిరించి తొలగించాలి.

కాండంపై బంక కారుతున్న ప్రదేశాలను శుభ్రపరిచి రక్షణ పేస్ట్ రాయాలి.

అదే రోజు మొక్క పాదులో మందుల మిశ్రమాన్ని నీటితో కలిపి పోయాలి.

ఐదవ రోజు

తోట మొత్తం పిచికారీ

మొక్కల గుబురు, కాయలు మరియు పిందెలపై వ్యాధి నిరోధక మందులతో తోట మొత్తం పిచికారీ చేయాలి.

పదవ రోజు

పునరుద్ధరణ చికిత్స

మొక్క పాదులో మరోసారి మందుల మిశ్రమాన్ని నీటితో కలిపి పోయడం ద్వారా మొక్కలకు శక్తి అందించి వ్యాధి ప్రభావాన్ని తగ్గించవచ్చు.

**రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు**

వ్యాధి సోకిన మొక్కలు, కొమ్మలను వెంటనే తొలగించి కాల్చివేయాలి

తోటలోకి అడవి జంతువులు రాకుండా కంచెలు ఏర్పాటు చేయాలి

మొక్కల గుబురులో జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి

ప్రధాన కాండానికి 2--3 అడుగుల ఎత్తు వరకు బోర్డో మిశ్రమం పూత వేయాలి

నీరు పోసేటప్పుడు కాండానికి తగలకుండా డబుల్ రింగ్ పద్ధతిలో ఇవ్వాలి

తోటను తరచూ పరిశీలిస్తూ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చర్యలు తీసుకోవాలి.

**త్వరిత చర్యలతో నష్టం తగ్గింపు**

క్షేత్ర పరిశోధనల ప్రకారం, వ్యాధి సోకిన మొక్కలకు మొదటి, ఐదవ మరియు పదవ రోజుల్లో సరైన చికిత్స అందిస్తే మొక్కలు కోలుకునే అవకాశాలు ఎక్కువగా వుంటుంది.

రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే తోటల ఉత్పత్తి మరియు దిగుబడి మెరుగుపడే అవకాశం ఉంటుంది

వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్న ఈ పరిస్థితిలో రైతులు అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చర్యలు తీసుకుంటే తోటలను కాపాడుకోవడం సాధ్యమవుతుంది.

డాక్టర్ రామిశెట్టి శివశంకర్
స్వతంత్ర పరిశోధకుడు
మరియు చైర్మన్ & ఫౌండర్,
డా. ఆర్ఎస్ఎస్
రీసెర్చ్ ఫౌండేషన్



# ఆలోచించావా?

ఈ రాజభోగం నీకెక్కడి నుంచో ఆలోచించావా?
ఈ వెలుగు జీవితం ఎవరినిదో ఆలోచించావా?

రోజువారి సుఖాల్లో మునిగే ఆనందమిదో ఆలోచించావా?
అమ్మ అయ్యలు మిగులు తిన్న రోజులదో ఆలోచించావా?

నీ కడుపు నింపిన ప్రతి ముద్ద ఎవరిదో ఆలోచించావా?
తన ఆకలి మింగి పెట్టిన ప్రేమమిదో ఆలోచించావా?

పలక బలపం మోసిన నాన్న
చెమట చుక్కలదో ఆలోచించావా?
నీ భవిష్యత్తు కోసం వదిలిన
నిద్రలదో ఆలోచించావా?


పెళ్లి కోసం ఏడు తరాల చిట్టా చూసిందో ఆలోచించావా?
వృద్ధాశ్రమం కాదు, మనసైన
ఇల్లు కోరిందో ఆలోచించావా?

డబ్బు పిచ్చి జబ్బులో మునిగిందో ఆలోచించావా?
డాంబిక జీవితం నిన్ను మోసమిదో ఆలోచించావా?

పబ్బులు, లాంగ్ ట్రిప్‌లలో
కాలం గడిచిందో ఆలోచించావా?
తల్లిదండ్రుల ఒంటరితనం
పెరిగిందో ఆలోచించావా?

నీకు ఆసరా కావాల్సిన వేళ
ఎవరుంటారో ఆలోచించావా?
కాలం గడిచేలోపే వారు
దూరమయ్యారో ఆలోచించావా?

తర్వాత ఆశ్రమ దారి మిగిలిందో
ఆలోచించావా?
నిన్ను నిలబెట్టిన వారి ప్రేమే
నిజమిదో ఆలోచించావా?



డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్
ఫోన్ 9640687608

### సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో

# ఘనంగా మెడికల్ హెల్త్ కేర్ అవగాహన

## అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు ప్రాక్టికల్ శిక్షణ

**విశాఖపట్నం, జయ జయహే:**

సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, అలాగే అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించగల సామర్థ్యాన్ని ప్రతి ఒక్కరిలో పెంచడం లక్ష్యంగా సుఖీభవ సంస్థ యాజమాన్యం మరియు మార్కెటింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో మెడికల్ హెల్త్ కేర్ అవగాహన కార్యక్రమం మరియు ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ క్యాంప్ సుఖీభవ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సంస్థ సిబ్బందికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడే విధంగా రూపకల్పన చేయబడినది. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.ఎస్.కె. మూర్తి, డైరెక్టర్లు మీర్ అబ్బాస్ హుస్సేన్, ఎన్. హరి కృష్ణ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి హాజరైన మార్కెటింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది ఎంతో ఆసక్తి చూపించారు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫిజియోథెరపిస్ట్ డా. పర్వీన్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు, ఒత్తిడి, శారీరక వ్యాధులు వంటి సమస్యలను నివారించేందుకు సరైన జీవనశైలి ఎంతో అవసరమని వివరించారు. రోజువారీ వ్యాయామం, సమతుల్య ఆహారం, సరైన నిద్ర, మానసిక ప్రశాంతత వంటి అంశాలు ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆమె స్పష్టం చేశారు. అలాగే ఉద్యోగ జీవితంలో ఒత్తిడిని ఎలా నియంత్రించాలి, చిన్నచిన్న వ్యాయామాల ద్వారా శరీరాన్ని ఎలా ఫిట్‌గా ఉంచుకోవాలి అనే విషయాలను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు.




అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి రహమతుల్లా మాట్లాడుతూ, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ప్రమాదాలు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయో తెలియని పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించగలగడం చాలా ముఖ్యం అని అన్నారు. గాయపడిన వారికి రక్తస్రావం ఆపడం, గుండె ఆగినప్పుడు చేయాల్సిన చర్యలు, శ్వాస సమస్యలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలి, అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని ఎలా సంరక్షించాలి వంటి కీలక అంశాలను వివరించారు.

ఇక ప్రాక్టికల్ సెషన్‌లో భాగంగా ఫస్ట్ ఎయిడ్ పద్ధతులను ప్రత్యక్షంగా చూపిస్తూ, సిబ్బందికి చేతుల మీదుగా శిక్షణ ఇచ్చారు. ఈ డెమో ద్వారా సిబ్బంది మరింత స్పష్టత పొందారని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా సుఖీభవ సంస్థ సిబ్బందిలో ఆరోగ్యంపై చైతన్యం పెరగడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయగల సామర్థ్యం పెరిగిందని, ఇది భవిష్యత్తులో సమాజానికి కూడా ఉపయోగపడుతుందని సంస్థ యాజమాన్యం పేర్కొంది.

కార్యక్రమం ముగింపు సందర్భంగా పాల్గొన్న వారందరికీ సందేహ నివృత్తి కార్యక్రమం నిర్వహించి, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం అందరికీ భోజన వసతి కల్పించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి, సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

సమాజ సేవలో భాగంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు సుఖీభవ సంస్థ కట్టుబడి ఉందని యాజమాన్యం వెల్లడించింది.



## వారపు సంతలో పోలీసుల అవగాహన కార్యక్రమం

**కొయ్యూరు (జయ జయహే )న్యూస్ ఏప్రిల్ 20**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం కొయ్యూరు వారపు సంతలో శనివారం మంప పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంప పోలీస్ స్టేషన్ అధికారులు, కొయ్యూరు సీఐ కలిసి సంతకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. మంప, కొయ్యూరు పరిధిలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులతో సమావేశమయ్యారు రోడ్డు భద్రత, మహిళా భద్రత, సైబర్ నేరాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల దుర్వినియోగంపై వివరించారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఆటపాటలకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నీటి గుంటలు, లోయలు, వాగుల వద్దకు పిల్లలను ఒంటరిగా పంపవద్దని సూచించారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకుని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.





## ఘనంగా డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి

**అనకాపల్లి (జయ జయహే)**

అబ్దుల్ కలాం సేవ సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఉడ్డిపేట సుభాష్ చంద్రబోస్ హాస్టల్ విద్యార్థుల సమక్షంలో స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల రైతుకార్మిక,పేద ప్రజల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన మహానేత డా. సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్,జై భీమ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు రేబాక మధుబాబు, మాజీ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, నటభూషణ్ శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో దేశభక్తి స్ఫూర్తితో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి జాతీయోద్యమంలో తనదైన ముద్ర వేసిన ఆయన, స్వాతంత్ర్యం అనంతరం వెనుకబడిన వర్గాలు, బడుగు బలహీన ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో ప్రజా జీవితాన్ని అంకితం చేశారు ప్రజల సమస్యల పై స్పందిస్తూ, నిరుపేదల కోసం గళమెత్తుతూ, నిస్వార్థ సేవా భావంతో రాజకీయాలను ప్రజాసేవగా మలిచిన అరుదైన నాయకుడు ఆయన. నిరాడంబర జీవనం, నిజాయితీ, నిబద్ధతతో కూడిన నాయకత్వం ఆయనను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయి.ఆ మహనీయుని ఆశయాలు, సేవా తపన నేటి తరాలకు స్ఫూర్తి. ప్రజల లోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ప్రతి ఒక్కరిలో ఉందని తెలిపారు . ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ హాస్టల్ వార్డెన్ రాజు, జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని చరణ్, హాస్టల్లో ఉపాధ్యాయులు దేవామణి, త్రివేణి, కళావతి, రాజ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, నర్సింగరావు, శ్రావణ లక్ష్మి, దుర్గాదేవి, శశికళ, కృష్ణవేణి మరియు తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్న స్వామిని దర్శించుకున్న హోం మంత్రి అనిత





**చందనోత్సవం నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి**

**అధికారులకు పలు సూచనలు చేసిన హోం మంత్రి**

**సింహాచలం, ఏప్రిల్ 19:-(జయ జయహే)**

సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామివారిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందించారు. సోమవారం జరిగే అప్పన్న స్వామివారి చందనోత్సవం నేపథ్యంలో సింహగిరిపై ఏర్పాట్లను హోం మంత్రి అనిత పరిశీలించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటూ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మౌలిక వసతులు, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఆలయం వద్ద సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏర్పాటు పరిశీలనలో ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్, సింహాచలం ఆలయ ఈవో వెంకటరావు, డీసీపీ 2 మేరీ ప్రశాంతి తదితర అధికారులు పాల్గొన్నారు. సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో ఏఐ టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. సామాన్య భక్తులకు దర్శనంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గత ఏడాది చందనోత్సవానికి సుమారు 1.20 లక్షల మంది భక్తులు హాజరుకాగా, ఈ సంవత్సరం దాదాపు 2 లక్షల మంది వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నామన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామివారి దర్శనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు, తాగునీరు, మజ్జిగ వంటి ఏర్పాట్లు చేసినట్లు హోం మంత్రి అనిత వెల్లడించారు.




## భారత నారీ శక్తి ఎదగకుండా అడ్డుకున్నారు

**నాదెళ్ల జ్యోతి**

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ , రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిధా రాజు మరియు , జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు ఆదేశాల మేరకు,ఆదివారం బీజేపీ పార్టీ కార్యాలయంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు నాదెళ్ల జ్యోతి ఆధ్వర్యంలో మహిళల హక్కులను పూర్తిగా తుంచివేసే విధంగా పార్లమెంట్ లో విఫలమైన మహిళా రిజర్వేషన్ బిల్లుపై తీవ్రగా ఖండిస్తూ పత్రిక సమావేశం నిర్వహించారు .ఈ సమావేశం లో నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ భారత నారి శక్తి ఎదగకుండా అడ్డుకున్నారని ,మహిళల సాధికారతకు మూలస్తంభమైన మహిళా బిల్లును కావాలనే అడ్డుకోవడం మహిళలపై జరిగిన అన్యాయం మాత్రమే కాకుండా, వారి ఆశలు, ఆకాంక్షలపై నేరుగా చేసిన దాడిగా భావిస్తున్నామని అన్నారు మహిళల అభివృద్ధిని అడ్డుకునే ఈ విధమైన రాజకీయ ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, దేశంలో మహిళలు అన్ని విషయాలు గమనిస్తున్నారని స్పష్టం చేసారు .మహిళల హక్కులను దెబ్బతీసి ఈ నిర్ణయానికి బాధ్యత వహించిన వారిపై తీవ్రంగా మండిపడుతూ, రాబోయే రోజుల్లో మరింత బలమైన పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలియజేసారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రోహిణి , రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లలిత , జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ స్పందన పాల్గొని అభిప్రాయాలను వ్యక్తం చేశారు.




## గోరక్షణపేట రోడ్డులో గోతులపై వైసీపీ ఆందోళన

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

నగరంలో అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోరక్షణపేట రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదకరంగా మారిన గోతులను తక్షణమే పూడ్చాలని డిమాండ్ చేస్తూ వినూత్నంగా గోతుల్లో మట్టి వేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచనల మేరకు సిటీ యువజన విభాగం అధ్యక్షుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో భరత్ రామ్ హయాంలో నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని, ప్రస్తుతం మాత్రం పనులు నిలిచిపోయాయని అన్నారు. గోరక్షణపేట రోడ్డులో గోతుల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు గాయపడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ, రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉందని పేర్కొన్నారు.దుమ్ము, ధూళి వల్ల స్థానిక ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని విమర్శించారు. కనీస మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడం పాలకుల వైఫల్యమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## యు ఆర్ గ్రేట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**విశాఖపట్నం (జయ జయహే)**

హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ వారి 'యు ఆర్ గ్రేట్' 13వ వార్షికోత్సవం సందర్భంగా, నబీ ఉస్మాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ మదర్స్ ల్యాప్ ప్లే గ్రూప్‌లో ఉచితంగా నీరు మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో హాఫిజ్ ముహమ్మద్ రఫిక్ ఖాద్రి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఎం. హరీష్ కుమార్, మహమ్మద్ ఇషాక్ హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ యు ఆర్ గ్రేట్ టీమ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇషాక్, మెహరున్నీసా బేగం, అహ్మద్ షరీఫ్, ఎస్.కె. ఖుర్షీదా 44వ వార్డు మహిళా ఉపాధ్యక్షురాలు పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

# పక్షులు సంతోషంగా ఉంటేనే ప్రకృతి సంతోషంగా ఉంటుంది





## సి ఐ జి. ప్రేమ్ కుమార్

**అనకాపల్లి (జయ జయహే)**

పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పని చేస్తున్న గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలో గల వివిధ పార్కుల యందు పక్షుల సంరక్షణ కోసం వేసవికాలంలో తీవ్ర ఎండల దృష్ట్యా పక్షులకు తాగునీటి పాత్రలు,ధాన్యపు కుంచులు, గూళ్లను, పార్కుల్లో చెట్లపై ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ " ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో పక్షులు పాత్ర ఎంతో ముఖ్యమైనదని పక్షులు సంతోషంగా ఉంటేనే ప్రకృతి సంతోషంగా ఉంటుందనిఅన్నారు వేసవిలో నీటి కొరతతో పక్షులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు తింటే గింజలు, తాగునీరు గూళ్ళు, ఏర్పాటు చేస్తున్న గ్రీన్ క్లబ్ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని ప్రతి నెలా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతూ, అందర్నీ భాగస్వామ్యం చేయడం మామూలు విషయం కాదని, జీవవైవిధ్య పరిరక్షణలోనూ, విత్తనాల వ్యాప్తిలోనూ పక్షులు పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉ పాధ్యాయ మరియు వృక్షమిత్ర వార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ " ప్రతి ఇంటి ముందు చిన్న నీటి పాత్ర, కొద్దిగా ధాన్యం గింజలు ఉంచితే, అనేక పక్షుల ప్రాణాలను కాపాడుకోవచ్చు అని, ఇది చిన్న చర్య అయినప్పటికీ గొప్ప సేవ అని, మనతోపాటు చిన్న జీవులను బ్రతకనిద్దామని కోరడమైనది. గవరపాలెం లో గల పార్క్ యందు, మార్కెట్ యార్డ్ నందు, గాంధీనగర్లో గల పార్క్ యందు, మరియు శారదా నది ఘాట్ వద్దగల పార్క్ యందు 45 ధాన్యపు కుంచులు, తాగునీటి పాత్రలు,గూళ్ల ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా పక్షుల సంరక్షణకై గ్రీన్ క్లబ్ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో బోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ , విశ్రాంత అటవీ శాఖ రేంజర్ బీరా వినోద్ కుమార్ , పెంటకోట ఉమామహేశ్వరరావు , జగన్నాథ్ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి ,నైశెట్టి సత్తిబాబు , బేతాళం శేష సాయి , గ్రీన్ క్లబ్ మహిళా విభాగం అధ్యక్షురాలు రావూరి అనిత, గ్రంధి రంజిత, సుంకర పద్మలత , భానుమతి , వై శైలజ మరియు అధిక సంఖ్యలో గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు









# ఫణి శయనసూరి పోరాట పటిమతో తెలుగు భాషాభివృద్ధి

## ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్

**విశాఖపట్నం, ఏప్రిల్ 19, జయ జయహే**

తెలుగు భాషాభివృద్ధికి ఫణిశయన సూరి పోరాట పటిమ ఉండాలని తెలుగు తల్లి పాద పద్మశ్రీ డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. మాతృభాషా మహోద్యమానికి మరో శ్రీకారం అంటూ తెలుగు దండు ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మాతృ భాషాభివృద్ధికి మార్గమేది అనే అంశంపై సమాలోచన చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ గజల్ గాయకులు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని సభ ముందుంచారు. తెలుగు వారందరినీ ఇలాంటి వేదికలు కలుపుతాయన్నారు. తెలుగు భాష మమకార భాషగా మారాలని కోరుకున్నారు. తాను నిర్వహించిన ప్రపంచ మహా సభల తీరుతెన్నులు వివరించారు. ప్రాశ్చాత్య దేశాల్లో మాతృ భాషాభిమానంనకు సంబంధించిన కొన్ని కథలను చెప్పి, స్ఫూర్తిని కలిగించడంతో పాటు ఒక గజల్ పాడి వినిపించారు. సభాధ్యక్షులుగా విశ్వ హింధీ పరిషత్ అధ్యక్షులు , పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ హాజరై , మాతృభాషాభివృద్ధికి గల ఆటంకాలను ఉ దహరించారు. సమాజం ఏ దిశగా పయనిస్తోందో చెప్పుకొచ్చారు. ఫణిశయనసూరి వల్ల తెలుగు భాషకు రక్షణ జరుగుతుందన్నారు. డాక్టర్ సి. నారాయణ రెడ్డి తెలుగు భాషా కృషిని వినిపించారు. ప్రైవేటు విద్యా సంస్థల ప్రభావం, విద్యా వ్యవస్థ పై ఎలా ఉంటుందో చెప్పుకొచ్చారు. త్రిభాషా సూత్రాన్ని వివరించారు. ప్రముఖ వైద్యులు, భాషోద్యమకారులు డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో మాతృభాషపై అవగాహనా లోపం ఉందన్నారు. భాషపై ఇలాంటి సమస్యలు రావడం కొత్తేమి కాదన్నారు. బాల్యంలో భాషాభ్యసనం ఎలా జరుగుతుందో వివరించారు. సహజ ప్రక్రియలో బోధన జరగడం లేదని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల తప్పులు సరిదిద్దితూ బోధన జరగడం లేదన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన లయన్స్ కాన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్ ప్రతినిధి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇది మంచి కార్యక్రమమని అభినందించారు. తల్లి తండ్రులలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని ఉద్ఘాటించారు. ఈ సభలో కళారత్న డా.వి.సూర్యారావు, గజల్ కవి చల్లా రాంబాబు, బాలబాట రమణమ్మ,, సోమంచి వినయ్ భూషణరావు, గంగరాజు, మాధవి,నాగుల శ్రీనివాసరావు, సిహెచ్ చిన సూర్యనారాయణ, అడపా రామకృష్ణ, లక్ష్మీ నారాయణమ్మ ,డా.ఉపేంద్రశర్మ తదితరులు సూచనలు సలహాలు ఇచ్చారు.

# పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచుదాం





## ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి

## సమస్త జీవరాశినీ జివించేందుకు కృషి చేయాలి

## శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి : జె.వి. రత్నం,

**విశాఖపట్నం (జయ జయహే)**

పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచుదాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. ఆదివారం మురళి నగర్ లో మానవసేవే మాధవసేవ అసోసియేషన్ అధ్యక్షులు వరప్రసాద రావు ఆధ్వర్యంలో పశుపక్ష్యాదులకు నీరు, ఆహారం అందుబాటులో ఉంచేందుకు వందలాది పాత్రలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరారు. సమస్త జీవరాశినీ జివించేందుకు కృషి చేయాలి అని వివరించారు. శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. విత్తనాల బంతులు, ధాన్యం కంకులు కుచ్చులు తయారు చేసి, పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలని, మొక్కలు నాటాలని కోరారు. మనం అడవుల్లో, కొండలలో పర్యటించి అక్కడి వాతావరణం, జీవవైవిధ్యాన్ని పరిశీలించి పరిరక్షించాలని కోరారు. విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదాం అన్నారు. సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ మనం పీల్చే గాలిలో రెండు శ్వాసల్లో ఆక్సిజన్ లేకుంటె మృత్యువాత పెడతామని వివరించారు. పశు పక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచుదాం అన్నారు.




### జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన

# ఘనంగా నిర్వహణ

## పలు సేవా కార్యక్రమాల ప్రారంభం

**విశాఖపట్నం, ఏప్రిల్ 19, (జయ జయహే )**

రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రోటరీ జిల్లా 3020 గవర్నర్ రొటేరియన్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి , క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, సమాజాభివృద్ధిలో రోటరీ పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన భారతీయ విద్యా కేంద్రం చైర్మన్ ఆచార్య జి నాగేశ్వరరావు , విద్యా రంగంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు.

అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ . జి కే మూర్తి , భారతీయ విద్యా కేంద్రం కార్యదర్శి, ప్రిన్సిపాళ్లు మరియు ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రారంభించిన సేవా ప్రాజెక్టులు**

ఈ పర్యటనలో భాగంగా, రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ మరియు విశాఖ పోర్ట్ సిటీ రోటరీ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా బి వి కే విద్యా సంస్థలలో క్రింది సౌకర్యాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు:

రక్షిత మంచినీటి సదుపాయం: విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు మంచి నీటి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు.

క్రీడలు మరియు ఫిట్నెస్: విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు రెండు వాలీబాల్ కోర్టులు మరియు జిమ్ పరికరాలు అందజేశారు.

**రోటరీ ఫౌండేషన్‌కు విరాళం**

రోటరీ అంతర్జాతీయ సేవా కార్యక్రమాలకు మద్దతుగా, క్లబ్‌కు చెందిన 30 మంది సభ్యులు తలా 30 డాలర్లు చొప్పున రోటరీ ఫౌండేషన్ కు విరాళంగా అందజేశారు.

ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ రొటేరియన్ బి శివాజీ మాట్లాడుతూ, సభ్యుల సమిష్టి కృషి వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.క్లబ్ సెక్రటరీ రొటేరియన్ టి భార్గవ్ , కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.




### సచివాలయ ఉద్యోగుల సమస్యలపై

## రాజమహేంద్రవరం సదస్సు కీలక తీర్మానాలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.ఆర్. సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నగరంలోని ఆనం కళా కేంద్రంలో జరిగిన మేధోమథన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఉద్యోగుల సామర్థ్యాలను సరైన దిశలో మలచేందుకు స్పష్టమైన విధానాలు అవసరమని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులను తక్షణమే వారి మాతృ శాఖలకు పంపించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సర్వేలు ద్వారా సాధించిన ఫలితాలను ప్రజలకు వెల్లడించడంలో ఆలస్యం చేయవద్దని సూచించారు. ఉద్యోగులపై పెరుగుతున్న ఒత్తిడి, వేధింపులను వెంటనే నిలిపివేయాలని ఆయన అన్నారు.సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 18 విభాగాలకు చెందిన ప్రతినిధులు తమ నివేదికలను సమర్పించి, ఉ ద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన మార్గాలను గుర్తించి, వాటిని ప్రభుత్వానికి నివేదించాలనే నిర్ణయం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ కుమార్, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు పి. గిరి ప్రసాద్ వర్మ, కురుబ హనుమంతు, కిషోర్, వై. వినయ మోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశం ప్రారంభంలో అధిక పనిభారం కారణంగా మరణించిన సచివాలయ ఉద్యోగులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సు ద్వారా తీసుకున్న నిర్ణయాలు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దోహదపడతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కీలకమైన బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసేస్తాం.. ట్రంప్‌కు హౌతీల వార్నింగ్

## ట్రంప్‌కు వార్నింగ్ ఇచ్చిన హౌతీలు

## ప్రపంచ శాంతి విఘాత చర్యలు ఆపాలని హెచ్చరిక

## బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసేస్తామని ప్రకటన

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి తమపై చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో.. ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, ముడి చమురు రవాణా కొరత ఏర్పడటం ఇప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ నేపథ్యంలో హార్మూజ్ జలసంధిని తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్.. అమెరికా తీరుతో మళ్లీ మూసివేసినట్లు తెలిపింది. దీంతో మరోసారి ప్రపంచ దేశాల్లో చమురు సంక్షోభ భయాలు నెలకొన్నాయి.

హార్మూజ్ జలసంధి మూసివేతతో ఇప్పటికే తీవ్ర భయాందోళనలు వ్యక్తం అవుతున్న వేళ.. తాజాగా మరో జలసంధికి ప్రమాదం ఏర్పడింది. ట్రంప్ దూకుడు విధానాలు తగ్గించుకోకపోతే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తామని హౌతీలు ప్రకటించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యెమన్, జిబౌటి మధ్య ఉన్న బాబ్ అల్ మాండెబ్ జలసంధి.. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తుంది. ఇది సూయజ్ కెనాల్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మరో జలసంధి కావడం గమనార్హం. ప్రపంచ శాంతికి భంగం కలిగించే చర్యలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనసాగిస్తే తాము బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తామని తాజాగా యెమెన్‌లోని హూతీలు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇక ఈ బాబ్ అల్ మాండెబ్ జలసంధిని.. తాము ఒక్కసారి మూసివేస్తే.. తిరిగి దాన్ని ఓపెన్ చేయించడం ప్రపంచంలోని ఏ ఒక్కరికీ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే హౌతీ ప్రభుత్వ విదేశాంగశాఖ ఉప మంత్రి హుస్సేన్ ప్రకటించారు. ప్రపంచ శాంతిని చెడగొట్టి ఉద్రిక్తతలు పెంచే అన్ని చర్యలను తక్షణమే డొనాల్డ్ ట్రంప్ ఆపాలని హౌతీలు వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం అమెరికా చేస్తున్న విధ్వంసం నుంచి వెనక్కి వెళ్లాలని ఈ యుద్ధంపై అమెరికాకు సహకరిస్తున్న దేశాలకు కూడా హౌతీలు హెచ్చరికలు చేశారు. అలా చేయడమే అందరికీ మంచిదని పేర్కొన్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్‌తో లెబనాన్ చేసుకున్న ఏకపక్ష కాల్పుల విరమణ ఒప్పందం తీవ్ర అవమానకరమని హెజ్‌బొల్లా సెక్రటరీ జనరల్ నయీమ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ కాల్పుల విరమణకు హెజ్‌బొల్లా కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. గతంలోనూ 2024లో ఇజ్రాయెల్‌ను నమ్మి కాల్పుల విరమణ ఒప్పందం అమలు చేసుకోగా.. సామాన్య ప్రజలపై భారీగా దాడులు చేసినట్లు గుర్తు చేశారు. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానించే ఈ బాబ్ అల్ మాండెబ్ జలసంధి.. గల్ఫ్ ఆఫ్ ఎడెన్, ఎర్ర సముద్రంకు మధ్య ఒక ద్వారంలా ఉంటుంది. 30 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉండే ఈ బాబ్ అల్ మాండెబ్ జలసంధి.. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకలకు చాలా కీలక మార్గంగా నిలుస్తోంది.

ఈ మార్గంలో ప్రతీ రోజు 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతూ ఉంటుంది. అదే సమయంలో అంతర్జాతీయంగా జరిగే వాణిజ్యంలో 10 నుంచి 12 శాతం ఈ జలసంధి గుండానే పయనిస్తుండటం గమనార్హం.

# కవితకు కొత్త జోష్..

## పార్టీ పెట్టకముందే క్యూ కడుతున్న నేతలు.. జాగృతిలోకి మాజీ ఎమ్మెల్యే



(జయ జయహే)

కొత్త పార్టీ పెట్టకముందే కల్వకుంట్ల కవిత వద్దకు నేతలు చేరుకుంటున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు.. జాగృతిలో చేరారు. ఇక మరో మాజీ ఎమ్మెల్యే కవితతో భేటీ అయి చర్చించారు. మరోవైపు.. ఇప్పటికే పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించి.. ఆ దిశగా కీలక అడుగులు వేస్తున్న కవితకు ఇలా నేతలు పార్టీలో చేరడం సరికొత్త ఉత్సాహాన్నిస్తోంది. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారు ఇప్పుడు అభివృద్ధి కోసం ఏకతాటిపైకి రావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత .. తన కొత్త పార్టీ ఏర్పాటు ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. ఈనెల 25వ తేదీన తన కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేసిన కవిత.. దానికి సంబంధించిన ఏర్పాట్లు చూసుకుంటున్నారు. ఇప్పటికే కాశీ, అయోధ్య పర్యటన పూర్తి చేసుకున్న కవిత.. కొత్త పార్టీ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే తాను పెట్టనున్న పార్టీలోకి రావాలని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారులు, మాజీ మావోయిస్టులు, యువత, మేధావులకు ఇప్పటికే కవిత విజ్ఞప్తి చేశారు.


ఈ నేపథ్యంలోనే తాజాగా బోథ్ మాజీ ఎమ్మెల్యే.. కాంగ్రెస్ నేత రాథోడ్ బాపూరావు కవిత పార్టీలో చేరారు. ఆదివారం నాడు తన అనుచరులతో కలిసి హైదరాబాద్ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో.. జాగృతి కండువా కప్పి కవిత తన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్పందించిన కవిత.. రాష్ట్ర సాధన కోసం పని చేసిన నేతలంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న పార్టీలను వదిలేసి.. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా ఎదగనున్న జాగృతిలో చేరాలని విజ్ఞప్తి చేశారు.

2007లో కుటుంబంతో సహా తాను బోథ్ కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానన్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్పిరిట్ తో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్పూర్తితో పని చేయాల్సి ఉ ఒదన్నారు.

తెలంగాణ జాగృతి నుంచే రాథోడ్ బాపూరావు బీఆర్ఎస్‌లో చేరి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేసిన కవిత.. ఇప్పుడు తిరిగి జాగృతిలోకి వచ్చినట్లు తెలిపారు. తాను పెట్టనున్న కొత్త పార్టీలో చేరేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నేతలు వస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉ ద్యమకారులంతా ఇప్పుడు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. కొత్త పార్టీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదరణ ఉంటుందని వెల్లడించారు.తెలంగాణకు కవిత ముఖ్యమంత్రి కావాలని రాథోడ్ బాపూరావు ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడానికి కవిత ఇచ్చిన ధైర్యమే కారణమని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీలో తన తర్వాత వచ్చిన వారు కూడా మంత్రులు అయ్యారని.. కానీ తాను 2 సార్లు గెలిచినా మూడోసారి టికెట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినా తనకు సరైన ప్రాధాన్యత దక్కలేదని పేర్కొన్నారు. కొత్త పార్టీ పెట్టిన తర్వాత ఇచ్చోడలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. మరోవైపు.. సిరిసిల్ల జిల్లా నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నేతలు జాగృతిలో చేరినట్లు కవిత తెలిపారు. మరోవైపు.. ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్ట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్పీ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే లింగయ్య దొర కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో మతం కేటగిరిలో ఆదివాసీ అనే కాలమ్‌ను పెట్టలేదని.. దీంతో ఆదివాసీలు తామ మతాన్ని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి లేదని లింగయ్య దొర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది ఆదివాసీల సంస్కృతిని అవమానించడమేనని.. ఆదివాసీల కోసం జనగణనలో ప్రత్యేక కాలమ్ పెట్టాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. అదే సమయంలో భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఆదివాసీల భాష కోయతూర్‌ను చేర్చాలని కవిత డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న 12 కోట్ల మంది ఆదివాసీలు.. నిజమైన భారత దేశ సంస్కృతికి ప్రతినిధులు అని.. తమ కొత్త పార్టీలో ఆదివాసీల గౌరవాన్ని కాపాడుతామని హామీ ఇచ్చారు.




## మంత్రి అజారుద్దీన్‌కు 'ఆరు నెలల' గండం

### మంత్రి పదవి నిలిచేనా?.. గవర్నర్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ

(జయ జయహే)

మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పదవిని కాపాడుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ శివ ప్రతాప్ శు క్లాతో భేటీ అయ్యారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఆరు నెలల గడువు ఈ నెల 30తో ముగియనుండటమే దీనికి కారణం. గవర్నర్ కోటాలో అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ నియామకం ఫైల్ పెండింగ్‌లో ఉండటంతో ఉత్కంఠ నెలకొంది. మరో పది రోజుల్లో గెజిట్ విడుదల కాకపోతే అజారుద్దీన్ తన పదవిని వదులుకోవాల్సి ఉ ంటుంది. ఈ నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం గవర్నర్‌ను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఉదయం లోక్ భవన్‌కు వెళ్లిన సీఎం రేవంత్.. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ గురించి చర్చించినట్లు సమాచారం. రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. చట్టసభ సభ్యుడు కాని వ్యక్తి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఆరు నెలల లోపు అసెంబ్లీ లేదా కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఈ నెల 30వ తేదీతో ఆరు నెలల గడువు ముగియనుంది. అంటే మరో పది రోజుల్లోపు ఆయన ఎమ్మెల్సీగా నియమితులు కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంపిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంతో పాటు అజారుద్దీన్ పేరు ఉన్నప్పటికీ.. గవర్నర్ ఆ ఫైల్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోకపోవడంతో తీవ్ర ఉ త్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ నెల 30 లోపు గవర్నర్ ఆమోద ముద్ర వేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయితేనే అజారుద్దీన్ మంత్రిగా కొనసాగే అవకాశం ఉంటుంది. పది రోజుల గడువు మాత్రమే మిగిలి ఉండటంతో ఈ లోపు సాంకేతిక ఇబ్బందులను తొలగించి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం గవర్నర్‌ను కోరినట్లు తెలుస్తోంది. గవర్నర్ సానుకూలంగా స్పందిస్తేనే అజారుద్దీన్ పదవి సురక్షితంగా ఉంటుంది, లేనిపక్షంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. ఇక



2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ ఓడిపోయారు. అయితే ఆ తర్వాత 2025లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వటంతో పాటు అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న ముస్లిం మైనారిటీ ఓటర్లను ఆకర్షించడానికి, పార్టీ పట్టును బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. అయితే ఆ ఫైల్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో భేటీ కావటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## భవన నిర్మాణ రంగ కార్మికులకు పెన్షన్లు

(జయ జయహే)

భవన నిర్మాణ రంగ కార్మికులకు మంత్రి వివేక్ శుభవార్త చెప్పారు. వారిని ఆదుకునేందుకు త్వరలోనే పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అందుకోసం తగిన చర్యలను చేపడుతున్నట్లు వివరించారు. త్వరలోనే లేబర్ బోర్డు ఏర్పాటు చేసి.. అన్ని రంగాల కార్మికులకు లేబర్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ప్రమాద బీమా అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు మంత్రి వివేక్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ రంగం సహా అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఆదుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. అందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 20న సీఎం రేవంత్ మేడిగడ్డ సందర్శన

నస్తూరపల్లిలో బహిరంగసభ

20న సీఎం రేవంత్ మేడిగడ్డ సందర్శన

ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్ష

కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం

సాయంత్రం నస్తూరపల్లిలో బహిరంగసభ

రెండవ విడత రైతుభరోసా నిధుల విడుదల

(జయ జయహే)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 20వ తేదీ సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించ నున్నారు. సీఎం పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి మధ్యాహ్నం 1.45 గంటలకు హైదరాబాద్ లోని సీఎం నివాసం నుంచి బయలుదేరి 2.00 గంటలకు బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.00 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.05 నుండి 3.25 గంటల మధ్య శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం చేసి, ఆలయం వద్ద భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. 3.30 గంటలకు కాళేశ్వరం నుంచి బయలుదేరి 3.45 గంటలకు మహాదేవపూర్ మండలం మేడిగడ్డకు చేరుకుంటారు. అక్కడ 3.45 నుండి 4.30 గంటల వరకు మేడిగడ్డ బ్యారేజ్ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. సాయంత్రం 4.35 నుండి 5.30 గంటల వరకు అంబట్‌పల్లి గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 5.35 నుండి 6.00 గంటల వరకు మీడియా సమావేశంలో పాల్గొంటారు. 6.00 గంటలకు మేడిగడ్డ నుంచి రోడ్డు మార్గంలో



బయలుదేరి 6.30 గంటలకు కాటారం మండలం నస్తూరపల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ 6.30 నుండి 7.45 గంటల వరకు రైతు భరోసా పథకం రెండో విడత నిధులను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. తదుపరి రాత్రి 7.45 గంటలకు నస్తూరపల్లి నుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసానికి రోడ్డు మార్గంలో చేరుకుంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా యంత్రాంగం భారీ బందోబస్తుతో పాటు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. బహిరంగసభను జయప్రదం చేసేందుకు ప్రభుత్వం యంత్రాంగంతో పాటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా జనాన్ని సమీకరించే పనుల్లో నిమగ్నమయ్యారు.

# భానుడి భగభగలకు బ్రేక్..

తెలంగాణలో 5 రోజులపాటు వర్షాలు..

పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్


హైదరాబాద్‌లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన

గాలివాన ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

మేడ్చల్, రంగారెడ్డి సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

(జయ జయహే)

హైదరాబాద్ నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండలు మండిపోగా, మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల వడగళ్లు కూడా పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో ఒక భారీ చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. దీని ప్రభావంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం చూపింది. గత కొన్ని రోజులుగా మండిపోతున్న ఎండలకు కాస్త బ్రేక్ లభించనుంది. రాష్ట్రంలో 5 రోజుల పాటు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడనున్నట్లు తెలిపింది. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్



అలర్ట్.. మరికొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇక అకాల వర్షాలకు చేతికొచ్చిన పంట నాశనం అవుతోందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉ దయం 8 గంటలకే భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం పూట అసలు ఇంటి నుంచి కాలు బయటపెట్టాలంటేనే జనం భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎండల వేడిమి నుంచి ఉపశమనం కలిగించేలా వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు ఎండలతో మండిపోయిన తెలంగాణ కాస్తా చల్లబడనుంది. ఇప్పటికే పలు జిల్లాల్లో వడగళ్ల వానలు పడుతున్నాయి. ఇక అటు భానుడి భగభగలు.. ఇటు అకాల వర్షాలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఉక్కిరిబిక్కిరికి గురవుతున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం పూట భారీగా ఉ ష్ణోగ్రతలు నమోదు అవుతుండగా.. సాయంత్రం అయ్యేసరికి వాతావరణం పూర్తిగా మారిపోతోంది. ఒక్కసారిగా చల్లబడి, ఈదురు గాలులు, వడగళ్ల వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. చేతికొచ్చిన వరి పంట కాస్తా పొలాల్లోనే పడిపోయింది. ఇక పంట కోసి మార్కెట్‌కు తరలించిన ధాన్యం.. వర్షపు నీటికి కొట్టుకుపోవడం, తడిసిపోవడంతో ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆదివారం రోజున నిర్మల్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ అధికారులు ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఇక జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కొమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సిద్ధిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఇక ఇంతటి వర్షాల సూచన ఉన్నప్పటికీ.. మధ్యాహ్నం పూట ఉష్ణోగ్రతలు మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు. జగిత్యాల, ఆదిలాబాద్, కామారెడ్డి, కరీంనగర్, కొమురం భీమ్, జోగులాంబ గద్వాల్, మహబూబ్ నగర్, మెదక్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, నిజామాబాద్, నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో ఆయా జిల్లాలకు ఎండల తీవ్రత దృష్ట్యా ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.




### వర్షాకాలంలో ఈ ఆహారంతో
# ఆర్థరైటిస్ సమస్యలకు చెక్

**ఆర్థరైటిస్, ఇన్‌ఫ్లమేషన్‌తో బాధపడేవారిని వర్షాకాలం మరింత వేధిస్తుంది. వాతావరణ మార్పులు, తేమ పెరగడం వంటి కారణాలతో వర్షాకాలంలో ఆర్థరైటిస్‌తో బాధపడేవారిలో నొప్పి, వాపు వంటి లక్షణాలు తీవ్రమవుతాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాలు తీసుకోవడం ద్వారా ఈ లక్షణాల నుంచి కొంత ఉపశమనం పొందవచ్చని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు.**

వీటిలో పసుపు ముందువరసలో నిలుస్తుంది. పసుపులో ఉండే కర్కుమిన్ అనే పవర్‌ఫుల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ పదార్థం జాయింట్ పెయిన్‌ను, స్టిఫ్‌నెస్‌ను తగ్గించి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇక అల్లంలో ఉండే జింజరాల్ వంటి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ మాలిక్యుల్స్ తయారీని నిరోధించడంతో అర్థరైటిస్ లక్షణాలను తగ్గిస్తుంది.

సల్ఫర్ పదార్థాలు అధికంగా ఉండే వెల్లుల్లిని తీసుకోవడం ద్వారా ఇమ్యూనిటీ బలోపేతమై వర్షాకాలంలో అధికంగా ఉండే ఇన్ఫెక్షన్స్ ముప్పు నుంచి మనల్ని రక్షిస్తుంది. బ్లూ బెర్రీస్, బ్లాక్‌బెర్రీస్ సహా ఆకుకూరలు, ఆలివ్ ఆయిల్‌ను తరచూ తీసుకోవడం ద్వారా ఈ లక్షణాల నుంచి కొంత మేర ఉపశమనం లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇక వర్షాకాలంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం..

పసుపు
అల్లం
వెల్లుల్లిజి
బెర్రీస్‌జి
ఆకుకూరలు
ఆలివ్ ఆయిల్
నట్స్‌జి
ఫ్యాటీ ఫిష్
గ్రీన్ టీ
చియా సీడ్స్



# బెల్లంతో ఆరోగ్యానికి ఎన్ని ప్రయోజనాలో..

## చవితి సమయంలో స్వీట్స్ దీనితో చేయడానికి ఇదే ప్రధాన కారణమట



**వినాయకచవితి వచ్చేసింది. ఈ సమయంలో గణపతికి వివిధ రకాల ఫుడ్స్ చేసి పెడుతూ ఉంటారు. ముఖ్యంగా పలు రకాల స్వీట్స్ చేసి నైవేద్యంగా పెడతారు. అయితే వీటిని స్వీట్స్‌తో కాకుండా బెల్లంతో చేస్తే వినాయకుడు ప్రసన్నమవుతాడని.. గణపతి బొప్పాకి బెల్లం అంటే ఇష్టమని చెప్తారు. అయితే బెల్లంతో వంటలు చేయడం వెనుక ఓ సైంటిఫిక్ రీజన్ కూడా ఉందట. ఇంతకీ ఆ రీజన్ ఏంటి? వినాయకుడికి బెల్లంతో ఎలాంటి ప్రసాదాలు చేయొచ్చో ఇప్పుడు చూసేద్దాం.**

### బెల్లంతో చేసుకోగలిగే వంటలు ఇవే..

చవితి సమయంలో బెల్లంతో పాయసం, బొబ్బట్లు, పొంగల్, బెల్లం తాళికలు వంటి పలు రకాల ప్రసాదాలు చేయొచ్చు. అయితే ఈ వంటల వంటలను బెల్లంతో చేయడానికి ఉన్న రీజన్ ఏంటంటే.. హెల్త్ బెనిఫిట్స్. అవును వినాయక చవితి సమయంలో దాదాపు వర్షాలు వస్తుంటాయి. ఆ సమయంలో వచ్చే పలు రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో బెల్లం మంచి ప్రయోజనాలు అందిస్తుంది అంటారు. అంతేకాకుండా పలు రకాల దీర్ఘకాలిక సమస్యలను కూడా ఇది దూరం చేస్తుందట. బెల్లంతో ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఇవే..

### ముందు రోజే సిద్ధం చేసుకుంటే..

చాలామంది స్వీట్స్‌ని చక్కెరతో చేస్తారు. సమయం లేదనో.. త్వరగా అయిపోతుందనో.. ఇలా వివిధ కారణాలతో షుగర్‌తో స్వీట్స్ చేస్తారు. అయితే ఇవి ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కాబట్టి బెల్లాన్ని మీరు వాటికి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. పండుగరోజు బెల్లం కోరడం, బెల్లంతో వంటలు చేయడం కష్టమనుకుంటే.. ముందు రోజే బెల్లాన్ని తురిమి పెట్టుకుని.. పండుగరోజు ఈజీగా వంటలు చేయొచ్చు. ఇవి మీకు మంచి రుచిని అందించడంతో పాటు ఆరోగ్యానికి పలు ప్రయోజనాలు అందిస్తాయి.



### సీజనల్ వ్యాధులు మాయం..

వర్షాకాలంలో వచ్చే జీర్ణ సమస్యలను బెల్లం దూరంచేస్తుంది. మెరుగైన జీర్ణక్రియను అందించి.. ఆరోగ్యానికి ప్రయోజనాలు అందిస్తుంది. అయితే మీరు భోజనం చేసిన తర్వాత ఈ బెల్లాన్ని కాస్త నేరుగా తినొచ్చు. అలాగే మలబద్ధకం సమస్య మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే.. మీ డైట్‌లో బెల్లం చేర్చుకోవచ్చు. ఇది పేగు కదలికలను వేగవంతం చేసి.. సమస్యనుంచి ఉపశమనం అందిస్తుంది. ఇమ్యూనిటీని పెంచి సీజనల్ వ్యాధులను కూడా దూరం చేసే లక్షణాలను బెల్లం కలిగి ఉంటుంది.

### మహిళలకు చాలా మంచిది

రక్తహీనతతో ఇబ్బంది పడేవారికి బెల్లం మంచి ఆప్షన్. ఇది సమస్యను దూరం చేసి.. ఐరన్ శాతాన్ని పెంచుతుంది. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మైగ్రేన్ ట్రిగర్ అవుతుంది. అలాంటివారు బెల్లం తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని కూడా దూరం చేయగలిగే సత్తా దీనికి ఉంది. అలాగే గొంతు నొప్పిని కూడా ఇది దూరం చేసి మెరుగైన ఫలితాలు అందిస్తుంది. శరీరాన్ని డిటాక్స్ చేసి.. లోపలి నుంచి శుభ్రం చేసి.. ఆరోగ్య సమస్యల్ని దూరం చేస్తుంది. ముఖ్యంగా కాలేయ సమస్యలతో ఇబ్బంది పడేవారు నిపుణుల సూచనలతో బెల్లాన్ని తీసుకోవచ్చు. దీనివల్ల కాలేయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాలు అందిస్తుంది.

### సైడ్ ఎఫెక్ట్స్..?

బెల్లాన్ని తీసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా అంటే.. లేవనే చెప్పాలి. కానీ.. దీనిని లిమిట్‌గా తీసుకుంటే మంచిది. బరువు తగ్గేందుకు లేదా షుగర్ సమస్యతో ఇబ్బంది పడేవారు కేలరీలు, స్వీట్ విషయంలో కాస్త అవగాహనతో ఉండాలి. లేదంటే ఇది బరువు పెరగడానికి, రక్తంలో షుగర్ లెవెల్స్‌లో మార్పులు తీసుకువస్తుంది. కాబట్టి వీటిని తీసుకునే ముందు నిపుణులు లేదా వైద్యుల సలహాలు తీసుకోండి. హాయిగా వినాయకచవితికి బెల్లం ప్రసాదాలు చేసుకుని లాగించేయండి.

# ఇంట్లో కివీ పండ్ల మొక్కను ఎలా పెంచుకోవాలి?





ఇంట్లో తక్కువ స్థలం ఉన్నప్పటికీ , మేము చిన్న కూరగాయలు, పూల మొక్కలు, పండ్ల మొక్కలు పెంచుతాము. గుంతల్లో ఎక్కువ స్థలం ఉండడంతో ఇంటికి కావాల్సిన కూరగాయలు, పండ్లను కూడా పండిస్తున్నారు.

పట్టణ ప్రాంతాల్లో కూడా కొన్ని ఇళ్లలో డాబాలపై తోటలు ఉంటాయి. తక్కువ స్థలంలో పండ్లు, కూరగాయలు పండించడం ఇప్పుడు ఫ్యాషన్. కొంతమంది హాబీగా కుండీల్లో పండ్లు, కూరగాయలు పండించడం కూడా మనం చూడవచ్చు. టొమాటో, ఉల్లి, అల్లం, కుంకుమపువ్వు కుండలో తేలికగా పెరగడం మనం చూశాం. అయితే చిన్న స్థలంలో పండే పండ్లను చూశారా?

చిన్న స్థలంలో పండే పండ్లు చూశారా? వాటిలో కొన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం పెంచబడతాయి, మరికొన్ని ఇంట్లో అభిరుచి కోసం పెంచబడతాయి. అలాంటి పండులో కివీ పండు ఒకటి. కివీ పండు ప్రస్తుతం మార్కెట్‌లో అత్యంత ఖరీదైన పండు. ముఖ్యంగా డెంగ్యూ, జ్వరం వంటి అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పుడు, ప్రజలు ఈ పండును రుచి చూడడానికి ప్రయత్నిస్తారు.

ఆరోగ్య పరంగా ఇది చాలా మంచి పండు. కానీ ఈ ఒక్క పండు ధర 50 నుంచి 100 రూపాయలు. ప్రస్తుతం ఇది భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో మాత్రమే పెరుగుతోంది. అందువల్ల దీని ధర ఎక్కువ. మనం న్యూజిలాండ్‌ను కివీస్ రాజధాని అని పిలవవచ్చు. పెంపకందారులు చాలా మంది ఉన్నారు.

అయితే ఈ కివీ పండ్ల మొక్కను మనం ఇంట్లో ఎలా పెంచుకోవచ్చు? పండు పడిపోవడానికి ఎంత సమయం పడుతుంది? దాన్ని ఎలా చూసుకోవాలో చూద్దాం.

### కివి విత్తనాలు ఎక్కడ దొరుకుతాయి?

మీకు కివి విత్తనాలు కావాలంటే వ్యవసాయ మార్కెట్‌ను సంప్రదించండి. అవసరమైతే నర్సరీలో మొక్కలు కూడా అందుబాటులో ఉంటాయి. కానీ మీరు దాని విత్తనాల నుండి మీరే నాటవచ్చు. కివీ పండ్లను కోసి గింజను తీసి గిన్నెలో వేయాలి. తర్వాత బాగా కడిగి, ఒక కాగితాన్ని నీటిలో నానబెట్టి, గాలి చొరబడని డబ్బాలో ఉంచండి. సుమారు మూడు వారాల్లో, ఇది గర్భాశయం లోపల విచ్ఛిన్నమవుతుంది.

లేదా కివీ పండుకి రెండు వైపులా చిన్న కట్ చేసి, ఆ కోతకు అలోవెరా రాసి, మట్టితో కుండీలో వేసి పండును పాతిపెట్టి, పైన ప్లాస్టిక్ కట్టి మూడు రోజుల్లో వేళ్లూనుకుంటుంది. నర్సరీ నుండి పోషకమైన మొక్కను కొనడం సులభమైన మార్గం.

### ఎలా నాటాలి?

కివి మొక్క పెద్దదిగా పెరుగుతుంది. అది తీగలా వ్యాపిస్తుంది. కాబట్టి అది వ్యాప్తి చెందడానికి మంచి స్లాబ్ లేదా సపోర్టు వంటి కొన్ని మొక్కలు ఉండాలి. ఈ మొక్కలకు ఎక్కువ సూర్యరశ్మి రాకూడదు మరియు సూర్యరశ్మిని నిరోధించడానికి ఆకుపచ్చ కవర్ లేదా తెలుపు కవర్ ఉండాలి. నీరు కూడా పెద్ద మొత్తంలో అవసరం. కానీ ఈ మొక్కలు మూడేళ్ల తర్వాత ఫలాలను ఇవ్వడం ప్రారంభిస్తాయి. ఇది హిమాచల్ ప్రదేశ్, కాశ్మీర్, ఉత్తరాఖండ్ వంటి అనేక ప్రదేశాలలో పెరుగుతుంది. మీరూ ఒకసారి ప్రయత్నించండి.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com